ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగస్టు 16, 2015

ఆంధ్రుల ఆడపడుచు

ఆకాశ హర్మ్యాలు

అత్తా కోడళ్ల అనుబంధం

సినిమాలు సీరియళ్లు...ఏవైనా సరే! అత్తాకోడళ్లను ఒకరిమీద ఒకరు విషం చిమ్ముకునే విలన్లుగా ... విపరీత మనస్కులుగా చూపించడంలో పోటీ పడుతుంటాయి. నిజ జీవితంలోనూ అత్తాకోడళ్లు అలాగే వుంటారా... అన్న అనుమానాలనూ కలిగిస్తుంటాయి. అందరి సంగతి విడిచిపెడదాం. బాలీవుడ్‌లో రియల్ అత్తాకోడళ్లు ఎలా వుంటారో ఓ లుక్కేద్దామా!

ఐశ్వర్య - జయ బచ్చన్

జయా బచ్చన్ ఎప్పుడూ కోడలి పక్షమే. కోడలిగా ఐశ్వర్య తొలిసారి తమ ఇంట్లో కాలెడినప్పుడు ... ఆమెను కెమెరాల్లో బంధించేందుకు ఫొటోగ్రాఫర్లు పోటీపడ్డ క్షణాలను ఎవ్వరూ మర్చిపోలేరు. అప్పడు జయాబచ్చన్ కోడలిని పిల్చిన పద్ధతినీ మరువలేరు. 'ఐశ్వర్యాజీ' అనో, 'మిసెస్ బచ్చన్' అనో కాకుండా 'ఐష్' అని సంబోధించడం ఆశ్చర్యపరచింది. 'కార్వా చౌత్' వంటి ప్రత్యేక సందర్భాలలో తమ బహురాణికి జయ ప్రత్యేకస్థానం ఇచ్చి గౌరవించడం చూనస్తానే వుంటాం.

కాజోల్ - వీణా దేవగన్

బాలీవుడ్‌లో అన్యోన్య దాంపత్య జీవితం గడిపే జంటగా కాజోల్ అజయ్‌దేవగన్ పేరు సంపాదించుకున్నారు. కాజోల్‌కు తన అత్తగారైన వీణా దేవగన్‌తో మాంచి సాన్నిహిత్యం వుంది. షారూక్‌తో కలిసి నటిస్తున్న చిత్రం ఔట్‌డోర్ షూటింగ్ బల్గేరియాలో జరిగినప్పడు అత్తమ్మను వెంట తీసుకెళ్లారు. పైగా తను నిత్యం షూటింగులతో బిజీగా వుంటానని కాజోల్‌కు తెలుసు. అలాగే తమ ముద్దుల చిన్నారులు నైశ్య, యుగ్ అత్తమ్మ దగ్గర సురక్షితంగా వుంటారనీ తెలుసు. పిల్లలే కాదు. కాజోల్ సైతం వీణా దేవగన్‌ను 'అమ్మ' అనే పిలుస్తుంది ప్రేమగా.

కరీనా-షర్మిలా టాగూర్

సైఫ్ అలీ ఖాన్‌తో పాటుగా కరీనా కపూర్ ఖాన్ కూడా షర్మిలను 'అమ్మ' అనే పిలుస్తుంది ప్రేమగా. తన తల్లి బబితకు మాదిరిగానే అత్తగారైన షర్మిలను గౌరవిస్తుంది కరీనా. 'అమ్మ (షర్మిల) గొప్ప నటి, తార. అంతే కాదు. పటౌడీ సాబ్‌కు తగిన భార్య' అని సందర్భం వచ్చినప్పడల్లా చెప్తూనే వుంటుంది బెబో. అంతేనా! షర్మిలకు తను గొప్ప అభిమానినంటుంది.

నీతు - కృష్ణ కపూర్

ఇప్పటికీ బాలీవుడ్‌లో ఉత్తమ అత్తా కోడళ్లుగా నీతు కృష్ణకపూర్‌కు గుర్తింపు వుంది. అత్తగారి వంటగది నుంచి చొరవగా కూరలు తెచ్చుకోవడం మొదలుకొని అనేక విషయాలలో ఆమె సూచనలు, సలహాలు తీసుకుంటుంది నీతు. ప్రతి రోజు తప్పనిసరిగా అత్తగారితో ఫోన్‌లో సంభాషించాల్సిందే. ఒక్క మాటలో చెప్పాలంటే కృష్ణకపూర్ అంటే నీతుకు ఒక రకమైన భక్తిభావం వుంది. ●

ఇచ్చిన మాట...

మాట చాలా పవర్‌ఫుల్. దానికున్న శక్తిని మాటల్లో చెప్పలేం. కొందరు ఇచ్చిన మాటను ప్రాణం కన్నా మిన్నగా భావిస్తారు. ఊపిరి పోయినాసరే మాట తప్పరు. మడమ తిప్పరు. ఆరు నూరైనా... నూరు ఆరైనా నిలబెట్టుకుంటారు.

ఆరుగాలాలపాటు కాయకష్టం చేసుకొని బతికే రైతన్నకు మాటంటే మాటే. ఇచ్చినా పుచ్చుకున్నా అన్నీ మాట ప్రకారమే. కౌలైనా కూలైనా రుణమైనా....పండినా పండకున్నా అనుకున్న ప్రకారం ఇవ్వడమేకానీ ఎగ్గొట్టడం చేతకాదు. బ్యాంకు రుణం తీర్చలేని రైతన్న...అధికారుల అవమానాలు భరించలేని రైతన్న పాపం మాట తప్పలేకే ఆత్మహత్యకు పాల్పడుతున్నాడు.

పులికి ఇచ్చిన మాటకోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధమైన ఆవు కథను ఎవరు మాత్రం మర్చిపోతారు! ముందు తరాలకు అలా చెప్పకుంటూ పోతారు. అదీ ఇచ్చిన మాట తప్పకపోవడంలోని మహిమ.

అవసరార్థం మాటను ఇష్టమొచ్చిన రీతిలో వాడేసుకునేవారూ వున్నారు. మనిషికో మాట ఇస్తూ...చెప్తూ.. పబ్బం గడుపుకోవడంలో వీరు మహా ముదుర్లు. మాట ఇచ్చామన్న.. పుచ్చుకున్నామన్న...పట్టింపులేం వుండవు. ఒక్క మాటలో చెప్పాలంటే వీరు మాటల గారడీ చేసేస్తారు. ఎవరేం అనుకొన్నా...నవ్వుకొన్నా... అప్పటికి పబ్బం గడిస్తే చాలు.

ప్రాణంకన్నా మిన్నగా ప్రేమిస్తున్నా... పెళ్లాడతానంటూ కబుర్లూ షికార్లతో కాలక్షేపం చేసేసి తర్వాత అలా అన్నానా? అంటూ తప్పుకునేవారు ఎందరు లేరు. అప్పు తీసేసుకొని పువ్వుల్లో పెట్టి ఇస్తానని నమ్మబలికి తీరా తేదీ వచ్చేసరికి జంప్ చేసే జిలానీలెందరు కనిపించరు.

◆ మనలో మాట

మన పాలకులు వీరందరికంటే నాలుగాకులు ఎక్కువ చదివారు. ఎక్కిన ప్రతి వేదిక మీదా మాట మీద మాట ఇచ్చేస్తారు. మాటల కోటలు కట్టేస్తారు. నోరు తెరిస్తే చాలు మాటలు కోటలు దాటతాయి. కాకపోతే అడుగు మాత్రం గడప దాటదు. ఆ మాటలన్నీ నీటి మూటలే అని అర్థం కావడానికి ఎన్నో రోజులు పట్టదు. ఈసారొచ్చినప్పుడు కడిగేస్తాం అనుకొన్న వారల్లా ... తీరా కొత్త మాటల మాయలో పడిపోయి...ఈసారైనా మాట మీద నిలబడకపోతారా! చెప్పినట్టు చేయకపోతారా! అని కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తుంటారు. మళ్లీ మామూలే. అధికారంలోకి రావాలే కానీ మహిళలందర్నీ లక్షాధికారిణులను చేసేస్తానన్నాడో నేత. ఏమైంది! ఏమీ కాలా! ఆ మాట ఇవ్వక ముందు ఎలా వున్నారో అలానే ఆ పేదరికంలోనే మిగిలిపోయారు. ఓ పెద్దాయన తాను గద్దెనెక్కితే కుటుంబానికో ఇల్లు కట్టిస్తానన్నాడు. కొలతలు కూడా చెప్పేశాడు ఆర్భాటంగా. ఏమైంది? ఏమీ కాలా! నన్ను గెలిపించండి. విదేశాల్లో ఉన్న నల్ల డబ్బంతా తెచ్చి ఒక్కో ఇంటి ముందు 15 లక్షల రూపాయల కట్టలు పడేస్తానని చెప్పిన ఒక పెద్ద మనిషి ఏడాది గడుస్తున్నా ఆ మాట నిలుపుకోలేదు సరికదా, మరిచిపోయినట్టు నటిస్తున్నారు. ఇదని అదనేముంది! ఎన్ని మాటలు ఇచ్చినా ... అన్నీ గాలిలో కలిసిపోవడమే. ఓట్లు రాల్చుకొని పబ్బం గడుపుకోవడమే. పాపం వెర్రి జనమే ఇచ్చిన మాట ప్రకారం ఓట్లేసి గెలిపిస్తుంటారు! కానీ...ఓసారి రూటు మార్చితే ఎలా వుంటుందో మరి! ■



టపా

పడవ బడి

పిల్లలకు చదువులు అందని ద్రాక్షలాగా మారుతున్నాయి. మన ప్రభుత్వాలు అదిగో సింగపూర్, ఇదిగో జపాన్ అంటూ వరాలు ప్రకటిస్తున్నాయిగాని పిల్లల భవిష్యత్తుకు సంబంధించి ఎలాంటి వరాలు ఇవ్వకపోవడవంతో మధ్య తరగతి ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. బంగ్లాదేశ్‌లో పిల్లలు చదువుల కోసం పడవలు ఎక్కుతున్నారని చదివి ఆనందపడ్డాం. పడవలో వారికి కావాల్సిన విద్యాభ్యాసం పూర్తిగా అందుతుండడం మంచిదేకానీ ప్రభుత్వాలు కదా ఇందుకు పూనుకోవాల్సింది!

దేవరాజు, విజయనగరం.

రక్తదానం

మనిషి రక్త దానం చేయడం చూసాం. కుక్కలు కూడా రక్తం ఇవ్వడం నిజంగా అద్భుతం.మేరీ క్రాడ్డక్ అనే ఈ శునకంతో పాటు మరో 6500 కుక్కలు కూడా రక్తదానం చేయడం నిజంగా గొప్ప విషయం. కాలికి చేయి కలపడం శస్త్ర చికిత్సలో సరికొత్త అధ్యయనంగా చెప్పుకోవచ్చు. ఈ వారం నవ్వుల్ పువ్వుల్ బాగున్నాయి. బాలీవుడ్ డాక్టర్లు సినిమా రంగంలోని యాక్టర్లకు డాక్టరేట్ ఇవ్వడం చాలా బాగుంది.

సోము, ఖాజీపేట

బాడీ బిల్డర్

సాధారణంగా బాడీ బిల్డర్లంటే పురుషులే అనుకుంటాం. చూస్తుంటాం. చాలా అరుదుగా మహిళ బాడీ బాల్డిర్‌లు మనకు కనిపిస్తుంటారు. అలాంటి వారిలో అశ్విని వాస్కర్ ఒకరని చదివి మనసులోనే మెచ్చుకోకుండా వుండలేకపోయాం. నేటి మహిళా బాడీ బిల్డర్‌లు ఈమెను ఆదర్శంగా తీసుకోవచ్చు. బిస్నుపూర్ అనగానే మనకు గుర్తుకు వచ్చేది అక్కడి ఆలయాలు,జీవన శైలిని తెలిపే చిత్రాలు. వీటితో పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. రామాయణం, మహా భారతం వంటి పురాణాల విశిష్టతను తెలిపే ఆలయాలు నేటికీ దర్శనీయం.

స్వాతి, రాజంపేట.

అమానుషం

రూపాయి కోసం మనిషిని చంపేస్తున్న విష సంస్కృతి మన చుట్టూ వుంది. అదే సమయంలో కుటుంబ ఆర్థిక అవసరాల కోసం తమ కిడ్నీలను అమ్ముకోవడం చాలా దారుణం. ఈ ప్రభావం వారి జీవితాల మీద పడుతు oదని...అలాంటి గ్రామం మన పొరుగు దేశమైన నేపాల్‌లో వుందని తెలిసి చాలా బాధపడ్డాం. బాధాకరమైన విషయమే అయినా చక్కటి వ్యాసం.

శ్రీను, గాజువాక

ఉల్లి కష్టాలు

ఇవాళ ఎవరి నోట విన్నా ఒకటే మాట ఉల్లి....ఉల్లి. ఉల్లికి అమాంతంగా రేటు రావడంతో దాని పేరు అంతలా మార్మోగు తోంది. రైతు పండించిన పంటకు గిట్టు బాటు ధర లేకపోతే ఏ ఒక్కరూ పట్టించు కోరు. ఎప్పుడైనా ఉల్లికి రేటు పెరిగీ పెరగ గానే కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి అంటూ గొడవ గొడవ చేసేస్తారు. అదే రైతు సరైన ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటే మాత్రం కనీస స్పందన కానరాదు. ప్రభు త్వాలే కాదు. మనిషి ధోరణి కూడా మారా లి, మార్చుకుందాం. ఉల్లి రైతు సమస్యను, వినియోగదారుడి కష్టాన్ని మనలో మాటలో ప్రస్తావించడం బావుంది.

రాము, కడప.

ఈ సంచికలో....

ఆకాశ హర్మ్యాలు

కవర్ స్టోరీ — 14

విమానంలో ఎగురుతూ నేలను చూడడం ఓ వింత అనుభవం. గాలిలో తేలిపోవడాన్ని మించిన మధురూహ మరోటి ఉండదు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వం మనుషులకుంటుందేమో కానీ.. భవనాలకు ఉండదు కదా. అందుకే అవి గర్వంగా తలెత్తుకునే ఉంటాయి. వాటిని చూడడానికి మనం మెడలు నొప్పెట్టేలా వెనక్కి వంచి చూడాల్సిందే. పగలు ఆకాశం అంచును ముద్దాడుతున్నట్లూ, రాత్రి చుక్కల్ని అందుకుంటున్నట్లూ విభ్రాంతిని కలిగిస్తాయి. అచ్చెరువొందిస్తాయి. అంతస్తుల మీద నిర్మించిన అంతస్తులు ఆకాశానికి నిచ్చెనలు వేసినట్లు అనిపించక మానదు. ఇదంతా ఒక ఎత్తయితే.. భవంతుల నిర్మాణం మరొకెత్తు.

జీవితం 3
మలి సంధ్యలో మాతృత్వం

నవ్వుల్ పువ్వుల్ 4

స్ఫూర్తి 5
నీళ్లు పోస్తే చాలు రయ్ రయ్

సినిమా కబుర్లు 6
ఆంధ్రుల ఆడపడుచు

వింత లోకం 8
వెర్రి 'తల'

సృజన 9
కాంచీపురం పట్టుకు జాతీయ పట్టం

విజయం 10
గర్భ'సంచి'

ఆదర్శం 11
అక్షరం అవసరం లేని కాలేజీ

కథ 18
ఎంకట లచిమి

రుచి 21
సగ్గుబియ్యం ఉప్మా

బాలనేస్తాలు 22
ట్రీ బ్యాట్

కొత్త పుస్తకాలు 24
చిట్ట చివరి రేడియో నాటకం

ఉచిత ఈ - పాఠశాలలు -12

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

రాజో దేవి లోహాన్ (77), బల్లో (79) దంపతుల కళ్లలో ఏదో తృప్తి. ఏదో సాధించామన్న సంతోషం. జీవితానికి ఈ ఒక్కటి చాలన్న నిశ్చింత కనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే... వారు ఇప్పుడున్నంత ఆనందంగా ఆరేళ్ల కిందట లేరు. ఆ సంతోషాన్ని తీసుకొచ్చింది మాత్రం కుమార్తె నవీన్.

అవమానాలను అధిగమించి...

హిస్సార్! సామాజికంగా ఆర్థికంగా వెనుకబడ్డ గ్రామం. మొత్తం జనాభా 2 వేలు. పిల్లలు కలగని వారిని సూటిపోటి మాటలతో మరింత బాధించడం సాధారణ విషయం. రాజోదేవినైతే ఏకంగా గొడ్రాలనే చెప్పుకునేవారు. పండుగలు, పెళ్లిళ్లు, ఇతరత్రా బహిరంగ కార్యక్రమాలకు వెళ్లడం మానుకున్నారు. ఆ మానసిక వేదనను భరించలేక, అవమానాలను తట్టుకోలేక మూలికలు మింగారు. పూజలు చేశారు. ఎవరేది చెప్తే అది చేశారు. అయినా సరే ఆమెకు కడుపు పండలేదు. దాంతో బల్లో సరాసరి అత్తగారింటికి వెళ్లి తను మారు పెళ్లి చేసుకుంటానని చెప్పేశాడు.

ఆమెకు డెబ్బై ఏడేళ్లు. ఆ పాపకు ఆరేళ్లు. స్కూలు నుంచి ఇంటికి రాగానే బ్యాగ్ తీసి పక్కకు విసిరేసి ఆమెను అల్లుకుపోతుందా చిన్నారి. ఆమె కూడా అపురూపమైన ఆ క్షణం కోసమే ఆతృతగా ఎదురుచూస్తున్నట్టు ... పాపను ముద్దులతో ముంచేస్తుంది. ఆ ఇద్దరినీ అలా చూస్తే ముత్తవ్వ మనవరాలనుకుంటారు ఎవరైనా. వారిది తల్లీకూతుళ్ల బంధమని చెప్తే నమ్మరు కాక నమ్మరు. హర్యానాలోని ఓ కుగ్రామం ఈ విశేషా నికి వేదికైంది.



మలి సంధ్యలో మాతృత్వం

పిల్లలు కలగని బాధకు ... భర్త మారు పెళ్లి ప్రస్తావన తోడు కావడంతో రోజు రోదనకు అంతు లేకుండా పోయింది. ఆమె ఏడుపు చూడలేని తండ్రి తన రెండవ కుమార్తె 'ఉమి'ని ఇచ్చి పెళ్లి చేశాడు. అయితే ఆ ప్రయత్నమూ విఫలమైంది. ఆమెకూ పిల్లలు కలగలేదు. ఆ నోటా ఈ నోటా ఐవిఎఫ్ చికిత్స గురించి విన్న బల్లో తన చిన్న భార్యకు చికిత్స చేయించాలనుకున్నాడు. అయితే ఆమెకు ఆరోగ్య పరమైన సమస్యలుండడంతో రాజోని ఎంపిక చేశారు. పొలం, చిన్న చిన్న ఆస్తులు అమ్మేసి మరీ ఆమెకు వైద్యం చేయించి ... అనుకున్నది సాధించాడు.

అతని అనురాగం అందుకున్న వేళ

పెళ్లి నాటికి రాజో వయసు పన్నెండు. అంటే యాభై ఎనిమిదేళ్ల వైవాహిక జీవితంలో ఏనాడూ భర్త తనను అంత ప్రేమగా చూడలేదు. బాగోగులు అడగలేదు. దగ్గర కూర్చుని కబుర్లు చెప్పలేదు. కానీ తన కడుపు పండిందని తెలిసిన నాటి నుంచి తుమ్మినా, దగ్గినా అతను కంగారు పడిపోవడం చూసి చలించిపోయింది రాజో. అతను తన పొట్ట మీద చెయ్యేసి ఊసులాడతాడని...తను వింటానని ఊహించనేలేదామె. ఆ అవకాశాన్ని కల్పించిన కడుపులోని బిడ్డంటే అప్పటి నుంచే ప్రేమ పెంచుకొందా తల్లి.



బల్లో, ఉమి, నవీన్, రాజో దేవి

డాక్టర్ పూర్తి విశ్రాంతి తీసుకోమని చెప్పినా వినేది కాదు రాజో. అలా రోజంతా ఖాళీగా వుంటే బిడ్డ ఆరోగ్యంగా పుట్టదని భయపడేది. అందుకే వీలైనంత వరకు పొలంలో, ఇంట్లో పని చేస్తూనే వుండేది. ఓసారి గడ్డిమోపు ఎత్తబోయి కిందపడి ఏడవ నెలలోనే కాన్పు చేయాల్సి వచ్చింది. అలా తొలిసారిగా మాతృత్వాన్ని చవిచూసింది రాజో. బిడ్డ జన్మించిన ఆనందంలో బల్లో ఊరంతా పండగ చేసేశాడు. వీధి మొత్తం లైట్లతో అలంకరించాడు. స్వీట్లు, భోజనాలు పెట్టించేశాడు. ఊరు ఊరంతా వచ్చి ఆతిథ్యం స్వీకరించి పాపను ఆశీర్వదించింది. బంధువులకైతే వారం రోజులపాటు ఇంట్లోనే భోజన ఏర్పాట్లు చేశాడు. మొత్తంమీద అందుకోసం మూడున్నర లక్షల రూపాయలు ఖర్చు చేశాడు.

అత్తారింటికి పంపాలి

వృద్ధాప్యంలో కృత్రిమ పద్ధతుల్లో బిడ్డను కనడంతో రాజోకు అనారోగ్యం పట్టుకుంది. సర్వికల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నా ... కుమార్తె నవీన్

సమక్షంలో

ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తోంది. ఆమెను అబ్బాయిలా మగ పిల్లల బట్టలు వేసి పెంచుతూ మురిసిపోతోంది. అన్నీ బాగుంటే పాపకు పెళ్లి చేసి అత్తారింటికి పంపాలన్నది రాజో ఆశ. తన తదనంతరం ఆస్తి అంతా పాపకే చెందేలా వీలునామా రాయించింది. ఒకవేళ తను పోయినా తన చెల్లెలు, పాపకు పిన్నమ్మ అయిన ఉమి వుందన్న ధీమాతో కాలం గడిపేస్తోంది రాజో. బల్లో సైతం మీసం మెలేస్తూ తనకంటే సగం వయసున్న వారికి ఏమాత్రం తీసిపోకుండా కష్టం చేసి సంపాదిస్తానని, పాపతో ఆడుకుంటానని అంటాడు. ఆ ముగ్గురి ప్రేమలో తడిసి ముద్దవుతూ పెరుగుతున్న ఆ పాప పెద్దయ్యాక డాక్టర్ కావాలని కలలు కంటోంది. మలి వయసులో తల్లిదండ్రులైన వారి కథ కాని కథ ఇది. ✦

నవ్వుల్ – పువ్వుల్

కుడి ఎడమైతే

గుళ్లో ప్రదక్షిణ చేస్తున్నప్పుడు నీ ముందున్న అమ్మాయి వెనక్కి తిరిగి మిమ్మల్ని కొట్టింది ఎందుకని?

"**పొ**రపాటుగా కాలు తొక్కాను.."

"**పొ**రపాటుగా తొక్కితే సారీ చెప్పొచ్చుగా!

"**కం**గారులో సారీకి బదులు నెవర్ మైండ్ అన్నా....

లీడర్

(మారుతి కాఫీ హోటల్‌కు వెళ్లాడు)

సర్వర్: ఏం కావాలి సార్!

మారుతి: ఏం వద్దు, నాకు ఆకలిగా లేదు.

సర్వర్: అయితే మరి ఇక్కడికెందుకొచ్చారు?

మారుతి: ఇది నా భోజన సమయం కాబట్టి!

గెడ్డం

"**నే**ను ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు సార్లు గెడ్డం గీస్తాను.

మరి నువ్వు.." సుధాకర్ని అడిగాడు గోవిందు

"**ఓ** నలభై, ఏభై సార్లు " చెప్పాడు సుధాకర్.

"**ఏం**టి అన్ని సార్లా.. నీ కేమైనా పిచ్చా?

"**కా**దురా..ఈ మధ్య సెలూన్ షాప్ పెట్టాను"

రక్షించండి

గండిపేట చెరువు దగ్గర" రక్షించండి...రక్షించండి.. మా అక్క నీళ్ళలో మునిగిపోయింది" అని రవి కేకలు పెట్టాడు.

వెంటనే నలుగురు యువకులు నీటిలో దూకి ఒక ముసలమ్మను బయటకు తెచ్చారు.

సారీ బాబు విచారంగా అన్నారు

"**థ్యాం**క్యూ అంకుల్. మునిగిపోయింది మా బామ్మే. అక్క కాదు" అన్నాడు రవి.

ఇంటర్వ్యూ

ఒక పత్రిక విలేఖరి ఓ రైతును ఇంటర్వ్యూ చేస్తున్నాడు "మీరు మీ మేకకు ఏం పెడతారు?"

రైతు: నల్లమేకకా,తెల్లమేకకా?

విలేఖరి: నల్లమేకకు

రైతు: గడ్డి

విలేఖరి: మరి తెల్లమేకకు?

రైతు: గడ్డి

విలేఖరి: మీరు మీ మేకలను ఎక్కడ కట్టేస్తారు?

రైతు: నల్ల మేకనా,తెల్ల మేకనా?

విలేఖరి: నల్ల మేకను..

రైతు: బయటి వసారాలో.

విలేఖరి: మరి తెల్ల మేకను?

రైతు: బయటి వసారాలో..

విలేఖరి: నీకసలు బుద్దివుందా? రెండింటికీ ఒకేలా చేస్తున్నప్పుడు అస్తమాను నల్ల మేకకా, తెల్ల మేకకా అని ఎందుకడుగుతున్నావు?

రైతు: ఎందుకంటే నల్లమేక నాది?

విలేఖరి: మరి తెల్లమేక?

రైతు: అదికూడా నాదే.

విలేఖరి తల గోడకేసి కొట్టుకున్నాడు. రైతు నవ్వుతూ అన్నాడు ఇప్పుడర్థమైందా మీరు టీవీలో ఒకే వార్త తిప్పి తిప్పి గంటల తరబడి చూపిస్తుంటే మాకు అలాగే ఉంటుంది?

విలువ

"**రెం**డు ప్లేట్లు వేడీ వేడీ గారెలు పట్రావోయ్" ఆర్డరేశాడు బ్రహ్మానందం.

"**చి**త్తం సార్" వెళ్లి రెండు నిమిషాల్లో తెచ్చాడు సర్వర్.

"**ఆహా** కమ్మగా ఉన్నాయ్. పిండి రోట్లో రుబ్బారా?" తింటూ అడిగాడు బ్రహ్మానందం.

"**అవును సార్**"

"**ఎంతైనా** గ్రైండర్లో రుబ్బితే ఇంత రుచి రాదు. చాలా బాగున్నాయి. మరో నాలుగు పట్రా"

"**థ్యాంక్యూ** సార్. మీరైనా "చెమట" విలువ గ్రహించారు.

◆

‘నీటితో నడిచే బైక్‌లు వస్తే ఎంత బావుండు! ఈ పెట్రో బాదుడుని తప్పించుకోవచ్చు’ అనిపిస్తుంది చమురు ధరలు పెరిగిన ప్రతిసారీ. బ్రెజిల్‌కు చెందిన ఓ బైక్‌వాలా అలా ఆలోచిస్తూ కూర్చోలేదు. అలాంటి బండిని తయారుచేసి ఎంచక్కా తిరిగేస్తున్నాడు. ‘ ఏం ఫలితంలే మంచి నీటినీ డబ్బు పెట్టి కొనుక్కోవాలి. ఆ బైకులు ఎక్కువయితే నీటి రేట్లు పెట్రోల్ కన్నా మండిపోతాయి. ఆయన పడ్డ కష్టం అంతా బూడిదపాలే’ అనుకుంటారేమో! మురికి నీళ్లు పోసినాసరే ఆ బండి దూసుకెళ్తుంది. ఒక్క లీటరు నీటితో ఏకంగా 500 కిలోమీటర్లను నడిపేయొచ్చు.



నీళ్లు పోస్తే చాలు... రయ్ ...రయ్...



బ్రెజిల్‌లోని సావోపాలోకు చెందిన రికార్డో అజెవాడో నెట్‌లో ఓ వీడియో పెట్టాడు. అది ఓ బండి నడుపుతూ. చూడ్డానికి మామూలు బైక్‌లా ఉన్న ఆ వీడియోకు కొన్ని వేల మంది చూసేంత స్పందన ఎందుకొచ్చిందో అర్థం కాక మనమూ ఓ లుక్కేద్దామని తీరా చూస్తే షాక్ తింటున్నారు. వీడియో మొదట్లోనే రికార్డో ఓ బాటిల్‌లోని నీళ్లను తాగి మిగతా నీళ్లను బైక్ ట్యాంక్‌లో పోస్తాడు. వీడికేమైనా పిచ్చా బండి పాడవుతుందని అనుకునేలోపు దాన్ని స్టార్ట్ చేసి నడపడం మొదలెడతాడు. అంతే అవాక్కవడం, షాక్ తిన్నవారు తేరుకుని పదిసార్లు వెనక్కు ముందుకు రీప్లే చూసుకోవడం, ఆ తర్వాత దాన్ని షేర్ చేయడం జరిగిపోతున్నాయి.

మరి మంచినీళ్లతో బైక్ నడపడం అంటే సాధారణ విషయమా. ఏదో ట్రిక్కు అనుకునేవారికి రికార్డో పాత సైన్సు సంగతినే కాస్త ప్రాక్టికల్‌గా వివరిస్తున్నాడు. నీటి రసాయన నామం ‘హెచ్2వో’. రెండు హైడ్రోజన్ అణువులు, ఒక్క ఆక్సిజన్ అణువుతో రసాయన బంధం ఏర్పరచుకుని నీటిలా మారుతుంది. ఈ బంధాన్ని విడదీస్తే హైడ్రోజన్, ఆక్సిజన్‌లు వేటికవే విడిపోతాయి. ఆ సమయంలో విడుదలైన శక్తి, హైడ్రోజన్ అణువులను శక్తి వనరుగా మారిస్తే అది బండి నడిపే శక్తిలా మారుతుంది. ఇలా నీరు విచ్ఛిన్నమవ్వాలి అంటే దానికి విద్యుత్‌శక్తి అవసరం. దీనికి రికార్డో కార్లకు బిగించే బ్యాటరీలను వాడాడు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక మళ్లీ హైడ్రోజన్, ఆక్సిజన్‌లు కలిసి నీటి ఆవిరి రూపంలో బయటకు వచ్చేస్తాయి. ఇదే సూత్రాన్ని హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్‌లో కాస్త భిన్నంగా ఉపయోగిస్తారు. అక్కడ విడిపోయిన ఆక్సిజన్ అణువుకు రుణావేశం ఉంటుంది. ఆ అణువుల మీద ఉండే ఎలక్ట్రాన్లు ప్రవహించి విద్యుత్‌ను సృష్టిస్తాయి. ఈ సాంకేతిక విషయాలన్నింటినీ పక్కన బెడితే రికార్డో తయారు చేశానని చెబుతున్న విధానం చాలా ప్రత్యేకం. పెట్రోల్ ట్యాంకులో పెట్రోల్ పోసినట్టు నీటిని పోయడం వినియోగదారులకు చాలా తేలికైన విషయం. అది కూడా మురికి నీటిని కూడా పోసే వీలుండటం ఆకట్టుకునే విషయం. ప్రస్తుతానికి ప్రొటోటైప్ దశలోనే ఉన్న ఈ ‘టీ పవర్ హెచ్2వో’ బైకును మార్కెట్ బాట పట్టించేందుకు రికార్డో ప్రయత్నిస్తున్నాడు. తన ప్రయోగం విజయాన్ని ఆమోదించేందుకు విమర్శకులకు వివరించి చెబుతున్నాడు. స్థానిక రైడర్ల అనుమానాలను తొలగించేందుకు డెమో కూడా ఇస్తున్నాడు.

కేవలం సాధారణ బ్యాటరీలతో అంత స్థాయి శక్తి కష్టమేనని అంటే, 6 నెలలుగా తన తండ్రితో కలిసి ఎన్నో అడ్డిటివ్స్‌ను పరీక్షించి 350 శాతం అధిక ఎలక్ట్రోలైసిస్ క్రియ జరిపే రసాయనాన్ని గుర్తించారని చెబుతున్నాడు. రికార్డో తండ్రి ఎర్నెస్టో గోంజలెజ్ సావోపాలోలో రసాయన శాస్త్ర ప్రొఫెసర్‌గా సేవల్ని అందిస్తున్నాడు. వారి అభివృద్ధి చేసిన విధానాన్ని ఇప్పుడు ఉన్న పెట్రోల్ ఇంజిన్‌లకు వాడొచ్చని, 10 గంటల పాటు ఒకేసారి నడపొచ్చని, సుమారు 500 కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు లీటర్ నీరు సరిపోతుందని అంటున్నాడు. త్వరగా బ్యాటరీ చార్జ్ తరిగిపోకుండా ఎఫ్ వన్ రేసు కార్లలో ఉపయోగించే కెనటిక్ ఎనర్జీ రికవరీ సిస్టమ్ (కెర్స్)ను వాడారని చెబుతున్నాడు. ఈ విషయాలన్ని తనిఖీ చేసుకునేందుకు స్థానిక మోటార్ వాహన డీలర్‌ను సంప్రదించాడు. రికార్డో కృషి మార్కెట్ స్థాయికి చేరితే వాహన రంగంలో భారీ మార్పులే చోటుచేసుకునే అవకాశముంది. అయినా పెట్రోల్ అంతా అమ్ముకున్నాక గానీ, ఇలాంటి ప్రయోగాలు మార్కెట్ బాట పట్టనివ్వరు. కానీ, సమాచార మార్పిడి వేగవంతమైన ఈ నెట్ ప్రపంచం చిన్నజీవుల విజయాల్ని సంచలనం చేసి ఆశావహంగానే కనిపిస్తోందిలెండి. చూద్దాం! మన వీధుల్లో ఈ నీటి వాహనాలు ఎప్పుడు రయ్‌మంటూ దూసుకెళ్తాయో!

చిరంజీవి చంద్రకళ ఆడపడుచుగా నటించింది. దీని వల్ల అన్నలుగా మాకు మహిళా ఫాలోయింగ్ పెరిగింది." అన్నాడు శోభన్ బాబు. "అశేషాంధ్ర ఈ చిరంజీవి చంద్రకళని ఆడపడుచుగా ఆదరించి అఖండ విజయం చేకూర్చారంటే ఆడపడుచు పాత్రలో ఆమె నటించలేదు. జీవించింది." అంటూ ఎన్టీఆర్ కితాబునిచ్చారు. చేతిలో ఒక ఇంగ్లీషు నవల అంతలోనే సెట్‌లోంచి పిలుపు... దర్శకుని సూచన మేరకు క్షణాల్లో ఆ షాట్ పూర్తిచేసి యూనిట్ ప్రశంసల్ని సొంతం చేసుకుని ఏ మాత్రం భేషజం లేకుండా ఫ్లోర్ బయటకి వచ్చి మళ్ళీ నవలలో నిమగ్నమైపోవడం ఆమె నిత్యకృత్యం. మనకున్న తెలుగు నటీమణుల్లో వాసంతి తర్వాత బాగా చదువుకున్న అమ్మాయి చంద్రకళ.

ఆంధ్రుల ఆడపడుచు

'అన్నా నీ అనురాగం.. ఎన్నో జన్మల పుణ్యఫలం.. పుట్టిన నీ దీవెనలే వెన్నెల కన్నా చల్లదనం..' అంటూ ఆడపడుచు చిత్రంతో తెలుగు ఆడపడుచుగా ఇంటింటికీ సొంతమైంది. "చిరంజీవి చంద్రకళ ఆడపడుచుగా నటించింది. దీని వల్ల అన్నలుగా మాకు మహిళా ఫాలోయింగ్ పెరిగింది." అన్నాడు శోభన్ బాబు. "అశేషాంధ్ర ఈ చిరంజీవి చంద్రకళని ఆడపడుచుగా ఆదరించి అఖండ విజయం చేకూర్చారంటే ఆడపడుచు పాత్రలో ఆమె నటించలేదు. జీవించింది." అంటూ ఎన్టీఆర్ కితాబునిచ్చారు. చేతిలో ఒక ఇంగ్లీషు నవల అంతలోనే సెట్‌లోంచి పిలుపు... దర్శకుని సూచన మేరకు క్షణాల్లో ఆ షాట్ పూర్తిచేసి యూనిట్ ప్రశంసల్ని సొంతం చేసుకుని ఏ మాత్రం భేషజం లేకుండా ఫ్లోర్ బయటకి వచ్చి మళ్ళీ నవలలో నిమగ్నమైపోవడం ఆమె నిత్యకృత్యం. మనకున్న తెలుగు నటీమణుల్లో వాసంతి తర్వాత బాగా చదువుకున్న అమ్మాయి చంద్రకళ.

అరుదైన వ్యక్తిత్వం

చెన్నై పోష్ ఏరియా బిషప్ వేలర్స్ ఎవెన్యూ ఎదురు రోడ్‌లో నాలుగు వేల చదరపు అడుగుల్లో పెద్ద భవనం. ఇంటి ముందు పెట్ డాగ్స్, పలకరించి పులకించే లవ్ బర్డ్స్, ఇంట్లోకి అడుగు పెట్టగానే కూచిపూడి సిద్ధేంద్రయోగి చిత్రపటం, ఆ పక్కనే శైవ మాస్టారితో తన ఫోటో, ఇంకొంచెం ముందుకెళితే పెద్ద లైబ్రరీ, ఆత్మీయులతో మాట్లాడేందుకు అనుకూలమైన వాతావరణం, ఇంటివారితో సంబంధం లేకుండా అవసరమైన వసతులు సమకూర్చేందుకు తన వ్యక్తిగత సిబ్బంది. ఎన్ని గంటలు మాట్లాడినా సాహిత్యం, సంగీతం, నృత్యం తప్ప మరో అంశం ఉండేది కాదు. ఎవర్నీ కామెంట్ చేసేది కాదు. హీరోల్లో శోభన్ బాబు సలహాలు తీసుకొనేది. సెన్సాఫ్ హ్యూమర్‌ని ఎక్కువగా అభిమానించేది చంద్రకళ పీజీ వుడ్‌హౌజ్‌ను ఎక్కువగా చదివేది. జీవితం గురించి మాట్లాడుతున్నప్పుడు 'ఏదీ మన చేతుల్లో లేదు.ది సీజ్ ఆల్ ప్రీ రికార్డెడ్ డ్రామా. మనం వీక్షించవలసిందే' అనేది. ఆమె ఇండస్ట్రీకి ప్రవేశించిన అనతికాలంలోనే తారా పథానికి దూసుకుపోయింది. ఏ కారణం చేతనో ఆమెతో కుటుంబ సభ్యులుండేవారు కాదు. చంద్రకళది సున్నితమైన మనసు... ఇట్టే కరిగిపోయేది.

'సంపూర్ణ రామాయణం'లో శోభన్ బాబుతో..

తెలుగులో ఎన్టీఆర్, అక్కినేని, కృష్ణ, శోభన్‌బాబు, రామకృష్ణలతో, తమిళంలో యంజీఆర్, శివాజీ, ముత్తురామన్, ఎవియం రాజన్, శివకుమార్ కన్నడంలో రాజ్ కుమార్, విష్ణువర్ధన్, కళ్యాణ్ కుమార్, శ్రీనాథ్, మలయాళంలో ప్రేమ్‌నజీర్‌తో నటించింది. చంద్రకళ ఏ భాషనైనా ఇట్టే నేర్చుకునేది. ఏ భాషల్లో నటిస్తున్నా అక్కడి వాతావరణాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకొని ఆయా పాత్రల్లో ఒదిగిపోయేది. అందుకే ఒక్కసారిగా అవకాశాలు చుట్టుముట్టాయి. ఖాళీ సమయాల్లో నాట్యం మీద మక్కువ చూపించేది. శాస్త్రీయ నృత్యాన్ని ఆరాధనగా చేసి పండిత పామరుల ప్రశంసలు అందుకున్నది.

మరుపురాని చిత్రాలు

ఆడపడుచు, రామ రాజ్యం, తల్లిదండ్రులు, సంపూర్ణ రామాయణం, దసరా బుల్లోడు, నోము, ఇద్దరూ ఇద్దరే ,పుట్టినిల్లు, తల్లా? పెళ్ళామా? కురుక్షేత్రం, జీవితంలో వసంతం మరువలేనివి. యంజీఆర్‌తో ఉళగంసుట్రం, వాలిబన్, కన్నడంలో రౌడీ రంగమ్మ, పునర్జన్మ, మార్గదర్శి, మలయాళంలో మూణుపోక్కల్, అలకళ్ చిత్రాల్లో ఆమె నటన మరపురానిది. ఆమె నటిగా ఎదిగే క్రమంలో హఠాత్తుగా పెళ్ళి చేసుకోవడం ఆమె పాలిట శాపమైంది.చంద్రకళ జీవితం మీద ఆమె నటించిన పాత్రల ప్రభావంఎక్కువగా ఉండేది. దసరా బుల్లోడు చిత్రంలో అక్కినేని, వాణిశ్రీలకు ఎంత పేరొచ్చిందో చంద్రకళకూ అంతే పేరు వచ్చింది. "ఈ చిత్రంలో నాదీ, వాణిశ్రీది ఆడిపాడే పాత్రలుగాని చంద్రకళది బరువైన పాత్ర. గట్టిగా గాలి వస్తే ఎగిరిపోయేలా ఉండే చంద్రకళ ఆ పాత్ర పోషించగలదా అని భయపడ్డాం. ఆ పాత్రలో నటింటచడం కాదు జీవించింది. ఆమెకు నిజంగా క్యాన్సరుందా అన్న భయాన్ని కలిగించింది." అని అక్కినేని సరదాగా అన్నారు. మరో సందర్భంలో శోభన్‌బాబు "చంద్రకళ నాతో ఏ సినిమాలో నటించినా ఆమె ప్రేమ విఫలమవుతుంది. కోడెనాగు చిత్రంలో నన్ను విపరీతంగా ప్రేమిస్తుంది. నేను లక్ష్మిని ప్రేమిస్తుంటాను. చివరికి మాయలోడి వలలో పడి పతనమవుతుంది. ఇక ముందు ఇలాంటి పాత్రలు చేయొద్దమ్మా" అని అన్నాడు. దసరా బుల్లోడు, కోడెనాగు చిత్రాల్లో పాత్రలు నిజజీవితంలోను ఆమెకు ఎదురయ్యాయి. మాయ మాటలు నమ్మి ఒక పరాయి దేశస్తుడి వలలో పడి సర్వస్వం కోల్పోయింది.

ఆమెకు నచ్చిన చిత్రాలు

బాపుగారి సంపూర్ణ రామాయణం చిత్రాన్ని విపరీతంగా అభిమానించేది. అసలు సీత అంటే ఇలాగే వుండాలి అన్న ప్రశంసలందుకుంది. తహసీల్దార్ గారి అమ్మాయి చిత్రంలో శోభన్ బాబుకి మరదలుగా ఆట పట్టించే పాత్ర. ఆ చిత్రంలో నిండు జీవితం కనిపించింది, ఎందుకో ఆ చిత్రం నాకు చాలా ఇష్టమంటుంది చంద్రకళ. తల్లా? పెళ్ళామా చిత్రంలో పెళ్ళాం పాత్ర అయిష్టంగానే ఎన్టీఆర్ కోరిక మేరకు నటించింది గానీ, నిజానికి తల్లా? పెళ్ళామా? అన్న ప్రశ్నే రాకూడదని, ఎవరైనా తల్లి తర్వాతే అని చెప్పింది. జీవితంలో మాతృస్థానానికి అంతటి విలువుంది. విపరీతంగా ఇష్టపడే పాత్ర దసరా బుల్లోడు చిత్రంలో దసరా బుల్లోడుని ప్రాణపదంగా ప్రేమించిన మరదలి పాత్ర. అల్లరిగా సాగే కథలో కదిలించే సన్నివేశాలు, కలకాలం గుర్తిండిపోయే సన్నివేశాలు చాలా ఉన్నాయి.

స్వాభిమానం ఎక్కువ

ఎప్పుడు పెళ్లయిందో ఎవరితో పెళ్లైందో ఎవరికీ తెలియదు. తెలిసిందల్లా చంద్రకళ పెళ్లయిపోయింది. ఇక నటించదు. భర్తతో చైనా వెళ్ళిపోయింది. ఇది మాత్రం అస్పష్టంగా ప్రచారంలో వుంది. తర్వాత చంద్రకళ గురించి సమాచారం లేదు. తర్వాత అయిదేళ్ల దాటకముందే చెన్నై వచ్చిందని తెలిసింది. ఎక్కడుందో తెలీదు. చంద్రకళని అభిమానించే శ్రేయోభిలాషులు చాలా మంది చెన్నైలో ఉన్నారు. కానీ ఎవర్నీ కలవలేదు. ఒకరోజు చంద్రకళ చనిపోయిందన్న వార్త వినిపించింది. ఆమె ఆత్మీయులు జీర్ణించుకోలేని చేదు నిజం!

ఇమంది రామారావు

9010133844

ఎలా చనిపోయింది? ఎక్కడ చనిపోయింది?

చంద్రకళ క్యాన్సరుతో చెన్నై వచ్చింది. నిలువ నీడ లేదు. వైద్యం చేయించుకుందామంటే మందులకు డబ్బులేదు. నెత్తురు కక్కుకుంటూ పైట కొంగు నోటికడ్డంగా పెట్టుకుంటూ సిటీ బస్సులో ప్రయాణం చేస్తూ.. ఎవరికీ మొహం చూపించేది కాదు. ఎవరైనా మీరు చంద్రకళా? అని అడిగితే సమాధానం చెప్పేది కాదు. కె.కె.నగర్ స్లమ్ ఏరియాలో చిన్న గదిలో నివసించేది. ఇంతకీ చంద్రకళ చనిపోయిందా? లేదా? అన్న అనుమానం కూడా కలుగుతుంది. నలుగురు పిల్లలకి నాట్యం నేర్పిస్తూ, సిటీ బస్సుల్లో తిరుగుతూ అతి నిరాడంబర జీవితం కొనసాగిస్తూ ఉండేది. జీవితంలో చివరి క్షణాలను లెక్కపెడుతూ జీవనం సాగిస్తుండేది. ఆ కళామతల్లి పాదాల్ని నెత్తుటితో అభిషేకం చేస్తూ నేల రాలిపోయింది.

రియల్ పొపాయ్

కార్టూన్ సీరియల్ 'పొపోయ్, ది సెయిలర్' షోలో పొపోయ్‌ను చూస్తే నిజంగా ఇంత పెద్ద చేతులుండేవారుంటారా అనిపిస్తుంది. కానీ, పొపాయ్ అంటే పిల్లలకు మాత్రం చాలా ఇష్టం. డబ్బాలో ఉన్న పాలకూర తినగానే పొపాయ్ చేతులు అమాంతం పెరిగిపోతాయి. కానీ అమెరికాలోని మిన్నెసోటాలోని జెఫ్ డేబ్ మాత్రం పాలకూర తినకుండానే పొపాయ్‌కున్న చేతులు కలిగి ఉన్నాడు. సుమారు 49 సెంటీమీటర్ల వెడల్పు ఉండే ఆయన చేతులు రెండింటితో రెండు బాస్కెట్ బాల్లను తేలిగ్గా పట్టుకోగలడు. స్కూల్ రోజుల్లో సహచరులు ఆయన్ను పొపాయ్ అని పిలిచేవారు. అదే ఆ తర్వాత ఆయన పేరు అయిపోయింది. ఆర్మ్ రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన జెఫ్ 1986లో తీవ్రంగా గాయపడి పోటీల నుంచి తప్పుకున్నాడు. చాలా ఏళ్ల తర్వాత తీవ్రంగా కసరత్తులు చేసి 52 ఏళ్ల వయసులో మళ్లీ ఆ పోటీల్లో పాల్గొనబోతున్నాడు. ఈసారి ఎడమచేత్తో ప్రత్యర్థులను ఓడిస్తున్నాడు. పుట్టడమే భారీ చేతులతో పుట్టిన జెఫ్‌కు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవని వైద్యులు తేల్చారు.

సుతి మెత్తని ఆతిథ్యం

జపాన్‌లో కొందరికి డబ్బు దేనికి ఖర్చు చేయాలో అర్థం కాకుండా పోతోంది. బొమ్మలకు కెఫేలు, టూర్లు నిర్వహిస్తున్నవారికి పంట పండిపోతోంది. ఆ బొమ్మల్లోను స్టఫ్‌డ్ టాయ్స్‌కు ప్రత్యేకించి యావారకాన్ అనే కెఫేను తెరిచారు. యజమానుల ఆలోచన వెనక పెద్ద లెక్కే ఉంది. జపాన్ మహిళల్లో 80 శాతం మంది దగ్గర ఓ స్టఫ్‌డ్ టాయ్ కచ్చితంగా ఉంటుందట. వారిలో 60 శాతం మంది వాటిని నిజం వ్యక్తుల్లా భావించి బెడ్‌పై కూడా అలంకరించుకుంటారట. వాటికి డ్రస్సులు, మేకప్పు వగైరాలు ఎక్కువే. అంత ఖర్చు చేస్తున్నవారు కెఫెకు పంపలేరా అనేది నిర్వాహకుల తెలివి. ఆ కెఫేకు పంపిన బొమ్మలకు మంచి విందు ఏర్పాటు చేసి వాటికి కథలు చెప్పి మిగతా బొమ్మలతో వాటి సరదాలను ఫొటోలు తీసి ఆల్బమ్‌ను వాటితో కలిపి తిరిగి ఇంటికి పంపిస్తారు. విందు అంటే అవి కూడా ఏవో బొమ్మ వంటకాలనుకోకండి. నిజమైన ఆహారాన్నే వాటికి పెడతారు. కాస్త బొమ్మ పెద్దలకు పేకాట ఆడుకోడానికి కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసేస్తారు. ఇక్కడ ప్రధాన వంటవాడు హెబీ చాన్ ఓ పాము బొమ్మ. సర్వ్ చేసేది హసేగవా అనే కోతి బొమ్మ. చక్కటి దెయ్యం కథలు చెప్పి వాటిని ఓ రాత్రి నిద్రపుచ్చి తర్వాతి రోజు ఎవరి ఇళ్లకు వాళ్లను చేరుస్తారు. ఇంకో నెలరోజులకు అక్కడ గదులన్ని బుక్ అయిపోయాయంటే ఎంత బాగా సాగిపోతుందో వారి వ్యాపారం.

వెర్రి'తల'

దక్షిణ కొరియాలో ఇప్పుడో హెయిర్ స్టైల్ ట్రెండ్ నడుస్తోంది. జుత్తును లవ్ సింబల్‌గా నుదుటిపై తీర్చిదిద్దుకోవడం ఎక్కువై పోయింది. కుర్రకారు ఈ జుత్తు కోసం వెర్రి'తల'లు వేస్తున్నారట. కొందరు సాహసం చేసి ముఖం కాలకుండా జుత్తును ఇస్త్రీ చేసుకుంటుంటే, కొందరేమో స్ట్రయిట్‌నర్లతో తంటాలు పడుతున్నారట. బాగా కాలిపోవడంతో జుత్తు పాడైపోతోందట. దీనికి తోడు స్ప్రేలను ఎక్కువగా వాడేసి వెంట్రుకలు ఎక్కువ సేపు నిలబడేలా అతికిస్తున్నారు. లవ్ సింబల్‌గా జుట్టు మారడానికి పూటలకు పూటలు సమయం ఖర్చయిపోవడం మరో సమస్య. అయినా కోరుకున్న షేప్‌లో అది కుదరక చాలామంది బిక్కమొఖాలు వేసుకుంటున్నారు. ఇంతకీ ఈ పిచ్చి వీళ్లకు ఎలా పట్టిందంటే కెండ్రాల్ జెన్నర్ అనే మోడల్ తన జుత్తు చివర్లను అనేక లవ్ సింబల్స్‌గా మడిచి ఫ్లోర్ మీద పడుకుని ఫొటో దిగింది. దీన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పెడితే ముప్ఫై లక్షల వరకు డబుల్ ట్యాప్‌లు నమోదయ్యాయి.

పెళ్లిళ్లు..పేరంటాలు..పండుగలు..పబ్బాలు ..సందర్భం ఏదైతేనేం! శుభకార్యాల్లో పట్టు వస్త్రాలకే ప్రథమ తాంబూలం. అంతటి విశిష్టత కలిగిన పట్టు చీరలకు పెట్టింది పేరు కాంచీపురం. తమిళ నాట పట్టు వస్త్రాలకు పేర్గాంచిన నగరం. ఈ నేలపై పుట్టి పెరిగి ... పట్టు చీరలు నేయడంలో తమకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకొన్న, సృజనాత్మకతను ప్రదర్శిస్తున్న ముగ్గురు ప్రతిభావంతులను జాతీయ అవార్డులు వరించాయి. వారే వి.సుందరరాజన్, కె.జయంతి, వి.పళనివేలు.

కాంచీపురం పట్టుకు జాతీయ పట్టం

చేనేతే కాదు. ఏ రంగమైనా సరే. సృజనాత్మకతను ప్రదర్శిస్తున్న వారిని ప్రభుత్వం గుర్తిస్తే... మరింత అంకితభావంతో పనిచేస్తారు. దేశ నలుమూలలకు చెందిన 73 మంది నేతన్నలను కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డులతో సత్కరించింది. వారిలో ముగ్గురు కాంచీపుర వాస్తవ్యులు. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయి నామమాత్రపు లాభాలు చేతికందుతున్న వేళ ... నమ్ముకున్న రంగాన్ని విడిచిపెట్టకుండా ... ప్రయోగాలు చేస్తూ తమ ఉనికిని ప్రపంచానికి చాటుతున్న గొప్ప కళాకారులు వీరు.

సృజనాత్మక నేతన్న

ఎవరికి వారు ఒక వృత్తి ఆధారంగా బతకడం వేరు. తమలా వందలాది మందికి బతుకునివ్వడం వేరు. రెండవ కోవకు చెందినవారు బహు కొద్ది మంది మాత్రమే మనకు తారసపడుతుంటారు. అలాంటివారిలో వి.సుందర రాజన్ ఒకరు. ఆర్థికంగా వెనుకబడిన వందకుపైగా కుటుంబాలకు ఉద్యోగావకాశాలు కల్పించారీయన. కనీసావసరాలైన తిండి, బట్ట, నివాసంతో పాటు వారి చిన్నారులకు విద్య కూడా ఉచితంగా అందేలా ఏర్పాటు చేశారు. 'విత్ బ్లౌజ్' చీరల గురించి అందరికీ తెలుసు. తమిళనాట తొలిసారిగా (1983) విత్ బ్లౌజ్ పట్టు చీరలను నేసిన ఘనత సుందరరాజన్‌దే. పైగా తన కలలకు కాంచీపురం పట్టుకొర్వాయ్ చీరను కాన్వాస్‌గా మలచుకొన్న ఘనాపాటి. వేలాది సంవత్సరాల కిందట పల్లవులు నిర్మించిన ఆలయ స్థంభాలపై చెక్కబడిన మూర్తులతో కూడిన అలనాటి వారసత్వానికి కంటికింపైన రంగులు అద్దడంలో నేర్పరి. చీరకు పల్లుది ప్రత్యేకాకర్షణ. ఆ పల్లులో సున్నితమైన కొమ్మలు అల్లిస్తారు. అందమైన పూలు పూయిస్తారు.

నిజానికి ఆయన ఈ భూమిమీద పడ్డాక తొలిసారిగా విన్నది మగ్గం శబ్దమే.

రెండోసారి...

వి.పళనివేలుది మరో విజయ గాథ. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ... చేనేతపై మమకారంతో నిత్య ప్రయోగాలతో సంప్రదాయ డిజైన్లకు తనదైన ముద్ర వేశారు. ఆయన నేసిన చీరలు భూత భవిష్యత్ వర్తమాన డిజైన్ల మిళితంగా పట్టు చీరల ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటాయి. మరో ఆసక్తికరమైన విషయమేమంటే... ఆ ఇంట జాతీయ బహుమతి అందుకున్న రెండవ వ్యక్తి పళనివేలు కాగా మొదటి వ్యక్తి మరెవరో కాదు. ఈయన తండ్రిగారే. ఇందిరాగాంధీ మరణించిన రోజు ఆమె కట్టుకున్న చీర తన తండ్రి నేసినదేనంటారు పళనివేలు (అయితే న్యూ ఢిల్లీలోని ఇందిరాగాంధీ మెమోరియల్ మ్యూజియం రికార్డుల ప్రకారం... ఆ చీర ఒడిషా నేత కార్మికుల చేతి మీదగా తయారైందని నమోదైంది.!)

'జయ' లక్ష్మి

జాతీయ అవార్డు సొంతం చేసుకొన్న ముగ్గురిలో జయంతి ఒకరు. సృజనాత్మక చేనేత రంగంలో పురుషులతో పోటీ పడి అంత గొప్ప విజయం సాధించడమంటే చిన్న విషయం కాదు. మువ్వన్నెలతో ముచ్చటగా పట్టుచీర నేసి మగువల మనసు దోచుకొన్నారీమె. దీన్నే 'కూర్వాయ్' డిజైన్ అని కూడా పిలుస్తారు. సన్నపాటి అంచు చీరలపై అందమైన నెమళ్లు, హంసలు, అశ్వాలను నేయడం జయంతి ప్రత్యేకత. మరో విశేషమేమంటే జయంతి ప్రతి సంవత్సరం ఈ అవార్డు ఎంపిక సమయంలో భర్తకు మాంచి పోటీ ఇచ్చేవారట. ఈసారి ఆయనను అధిగమించి అవార్డు అందుకున్నారు.

స్టాన్‌ఫర్డ్ డిజైన్ స్కూల్ ఓ విద్యార్థుల జట్టుకు ఓ సవాల్ ఎదురైంది. నిజ జీవిత సమస్యల్ని పరిష్కరించేలా అతి చవకైన ఏదో ఒక రూపకల్పన చేయాలనే ప్రాజెక్ట్ ఇచ్చారు టీచర్. ఆ ప్రాజెక్ట్‌ను మొక్కుబడిగా తీసుకోలేదా విద్యార్థులు. స్కూల్ దాటి ప్రపంచాన్ని చుట్టి ఓ అన్వేషణ చేశారు. నెలలు నిండకుండా జన్మించిన పిల్లలకు అది ప్రాణదాయిని అయింది. వేలాదిమంది పేద దేశాల తల్లులకు మాతృత్వ అనుభూతిని నిలిపే వరమైంది.

గర్భ 'సంచి'

కళాశాలల్లో ప్రాజెక్టులు మామూలే. వీటి కొందరు మొక్కుబడిగా చేస్తారు. కొందరు ప్రాణం పెట్టి కొత్త రూపకల్పనలకు ప్రాణం పోస్తారు. రెండో కోవకు చెందినవాళ్లే ఎలక్ట్రిక్ ఇంజినీర్ అయిన రాహుల్ పానికర్, ఎంబీయే గ్రాడ్యుయేట్ అయిన జేన్ చెన్, కంప్యూటర్ సైంటిస్ట్ అయిన లీనస్ లియాంగ్, డిగ్రీ పూర్తిచేసిన నాగానంద్ మూర్తిల విద్యార్థి బృందం. స్టాన్‌ఫర్డ్ డిజైన్ స్కూల్ విద్యార్థులైన వీరు ఓ ప్రాజెక్ట్‌లో తలమునకలయ్యారు. 2008లో వారికది సవాల్‌గా అనిపించింది. తొలుత ఏ సమస్యపై స్పందించాలో వారికి అర్థం కాలేదు. పర్యావరణ పరిరక్షణ, విద్యా సమస్యలు వంటి అనేక విషయాలను పరిశీలిస్తుండగా వారికో చేదు విషయం తెలిసింది. ఏటా కోటి యాభై లక్షల మంది పిల్లలు నెలలు నిండకుండానే జన్మిస్తున్నారని, పది లక్షల మంది హైపోథెర్మియాతో 24 గంటల లోపుగానే మృతి చెందుతున్నారని. దీనికి ఓ పరిష్కారం చూపాలని ప్రాజెక్టును స్వీకరించారు.

శిశువును వెచ్చగా ఉంచే ఇన్‌క్యూబేటర్ల ధర తగ్గించేందుకు అనేక మార్పుచేర్పులు చేశారు. చవకైన విడిభాగాలను మార్చారు.కానీ, దీంతో ఆ బృందం సంతృప్తి చెందలేదు. కొందరు అక్కడితో ఆపేద్దామని, కొందరు లేదు వాస్తవ పరిస్థితులు అర్థం చేసుకుని రూపకల్పన చేద్దామని చర్చలు జరిపారు. చివరకు లియాంగ్‌ను నేపాల్ పర్యటనకు పంపారు. అక్కడ లియాంగ్‌కు ఓ షాకింగ్ దృశ్యం కనిపించింది. ప్రభుత్వ వైద్యాలయాలు, ఇతర స్వచ్ఛంద సంస్థల దగ్గర తక్కువ రుసుముకే ఇన్‌క్యుబేటర్ల వసతి లభించినా ... అక్కడి ఇన్‌క్యుబేటర్లు ఖాళీగా ఉంటున్నాయి. సమస్య కేవలం ఖర్చు మాత్రమే కాదు. ఇంకా ఏదో ఉందని అర్థం చేసుకున్నాడు. స్థానిక వైద్యులను, నర్సులను, సేవా కార్యకర్తలను ఆ విషయం అడిగాడు. ఇన్‌క్యుబేటర్లున్న ఆస్పత్రుల నుంచి గ్రామాలు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరం ఉండటం ఒక సమస్య అయితే, రోజుల తరబడి బిడ్డల్ని వాటిలో ఉంచాలంటే ...తల్లితో పాటు కుటుంబ సభ్యులూ ఆస్పత్రి దగ్గరే పడిగాపులు కాయాలి. అంతంత మాత్రపు సంపాదన, వ్యవసాయ ప్రధాన జీవనాలుండే గ్రామాల్లో అది అసాధ్యం. అన్నేసి రోజులు ఉండలేక చాలా మంది తల్లులు ఓ నాలుగు రోజుల పాటు ఇన్‌క్యుబేటర్లలో పిల్లలను ఉంచి ఇళ్లకు తీసుకెళ్లిపోతున్నారనే విషయం లియాంగ్‌కు తెలిసింది. ఆస్పత్రులకు చవకైన ఇన్‌క్యుబేటర్లను రూపొందించడమా లేదా ఇళ్లకే రూపకల్పన తీసుకుపోవడమా అనే మీమాంస వారికి ఎదురైంది. చివరకు వారి ప్రొఫెసర్ సారా స్టీన్ గ్రీన్‌బెర్గ్ సలహా కోరారు. ఆమె ఇళ్ల వద్దకే ఆవిష్కరణకే మొగ్గు చూపి, అలాంటిది ఏదైనా చేయగలిగితే చాలా మార్పును తెచ్చినవారవౌతారని ప్రేరణనిచ్చింది.

చంటి బిడ్డల్ని వెచ్చగా ఉంచే బ్యాగులు వారికి గుర్తొచ్చాయి. వాటినే మరింత అభివృద్ధి చేసి మొబైల్ ఇన్‌క్యుబేటర్లుగా మారిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఆ కృత్రిమ గర్భ 'సంచుల' రూపకల్పనకు వెంటనే పని మొదలెట్టారు. కనీసం ఐదారు ప్రొటోటైపుల్ని సిద్ధం చేశారు. చివరకు పారాఫిన్ నింపిన బ్యాగులను రూపొందించారు. కొన్ని గంటలపాటు వెచ్చదనాన్ని నిలిపి ఉంచుకునేలా తయారు చేసిన ఆ బ్యాగులు చార్జింగ్‌తో వేడెక్కుతాయి. నిర్ణీత ఉష్ణోగ్రత పెరిగే వరకు చార్జింగ్ పెట్టుకునేందుకు దానికి థర్మామీటర్ జత చేశారు. సరిగ్గా పనిచేస్తున్న ఆ బ్యాగులకు 'ఎంబ్రేస్ ఇన్‌ఫాంట్ వార్మర్' అని పేరు పెట్టారు. ప్రపంచంలో జరిగే ప్రిమెచ్యూర్ జననాలు సగం సంభవించే భారత్‌పై తొలుత దృష్టి సారించారు. 2011లో స్థానిక ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు, నర్సులు, మిడ్‌వైఫ్‌ల సహకారంతో గ్రామాల్లో ఇన్‌ఫాంట్ వార్మర్‌లను ప్రవేశపెట్టారు. ఈ సమయంలోనే వారికి మరో విషయం తెలిసింది. వారు సూచించిన ఉష్ణోగ్రత కన్నా తక్కువ ఉష్ణోగ్రత వరకే వార్మర్ బ్యాగ్‌లకు చార్జ్ చేసి వాడుతున్నారని తెలుసుకున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు వారు ఆటోమేటిక్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. నిర్ణీత వేడికి చేరుకోగానే అలార్మ్ మోగేలా బ్యాగ్‌లను తయారుచేసి థర్మామీటర్లను తొలగించారు. ఆ బ్యాగులలో ఉంచిన కన్నబిడ్డల్ని తమ వద్దే పడుకోబెట్టుకునే సౌలభ్యం ఉండటం, పెద్ద ఖరీదు లేకపోవడం ఒక బ్యాగ్‌ను చాలామందికి ఉపయోగించగల్గడం, తేలిగ్గా శుభ్రపరుచుకోగలగడం వంటి అనేక అనుకూలతలు ఎంబ్రేస్ ఇన్‌ఫాంట్ వార్మర్ ప్రాజెక్టును విజయవంతంచేశాయి. రెండేళ్లపాటు భారత్‌లో విస్తృతంగా ప్రచారం చేశాక నేపాల్, మెక్సికో, గాటెమలా, ఉగాండా, జాంబియా, దక్షిణ సూడాన్, సోమాలియా, మొజాంబిక్, అఫ్ఘానిస్తాన్, చైనా దేశాలకు సేవల్ని విస్తరించారు. ఇప్పటి వరకు సుమారు లక్షా యాభై వేల మంది నవజాత శిశువుల ప్రాణాల్ని నిలబెట్టిందా ఆవిష్కరణ. ఓ క్లాస్‌రూం అసైన్‌మెంట్ ఓ భారీ మానవీయ మార్పును తెచ్చింది. ఈ విద్యార్థులంతా పెద్ద వ్యాపారులుగా మారాలని విద్య నేర్చుకున్నా వారి పయనం మాత్రం సామాజిక వాణిజ్యమే. ఆ ఒక్క ఆవిష్కరణతోనే ఆగిపోకుండా ఆ సమస్య నివారణకు మరిన్ని రూపకల్పనలు చేస్తూ సాగిపోతున్నారు. కొత్తగా మార్పుచేసిన ఇన్‌ఫాంట్ వార్మర్‌ను వేడినీటిలో మరిగించుకోవచ్చు. విద్యుత్ సమస్య ఉన్న ప్రాంతాలకు ఇది అమూల్యం. లగ్జరీ మరో స్థాయికి తీసుకెళ్లి బద్దకస్తుల్ని చేస్తున్న ఆవిష్కరణల ప్రవాహంలో పడిపోకుండా పేద ఇంటి ప్రాణాంతక కష్టాలకు పరిష్కారాలు చూపిస్తున్న ఇటువంటి బృందాలు చాలా అరుదు.

అజయ్ కుమార్ వారాల

రాజస్థాన్‌లోని తిలోనాకు వెళితే ఓ కొత్త భారత్‌ను చూస్తారు. గ్రామ స్వరాజ్య విశేషాన్ని కళ్లారా చూస్తారు. అక్కడ ఓ సంప్రదాయ ఆహార్యంలో ఉన్న మహిళ చేతిలో టూల్ కిట్‌తో సోలార్ కుకర్ పనిపడుతూ కనిపిస్తుంది. మరో అవ్వ జాగ్రత్తగా సర్క్యూట్ కేబుళ్లను కలుపుతూ కనిపిస్తుంది. వెల్డింగ్ చేసి భారీ సౌర ఫలకాలను రూపొందించే స్త్రీలు ఒక గదిలో, వర్ష నీటి నిల్వపై తరగతులు తీసుకుంటున్న అక్షరం తెలీని వ్యక్తి మరో గదిలో శబ్దం చేస్తుంటారు. ఇదంతా బేర్‌ఫుట్ కాలేజీ వల్లే సాధ్యమైంది.

అక్షరం అవసరం లేని కాలేజీ

ది సోషల్ వర్క్ అండ్ రీసెర్చ్ సెంటర్ (ఎస్.డబ్ల్యు.ఆర్.సి.)నే స్థానికులు బేర్ ఫుట్ (ఒట్టి పాదాల) కళాశాల అని పిలుచుకుంటారు. నీటి చుక్క అమృతంతో సమానమైన రాజస్థానీయులకు పెద్ద భాండాగారాన్నే ఇచ్చింది ఈ కళాశాల. ప్రపంచవ్యాప్తంగా 64 దేశాల్లోని మూరు మూల గ్రామాలకు మహిళా సోలార్ ఇంజినీర్లను అందిస్తున్న బేర్‌ఫుట్ విజయం వెనుక సంజిత్ బంకర్ రాయ్ ఉన్నారు. న్యూఢిల్లీలో ఉన్నత జీవితాన్ని అనుభవిస్తున్న బంకర్ రాయ్ డిగ్రీ చివర్లో సామాజిక కార్యకర్తగా పనిచేసేవాడు. 1965లో అప్పటి బీహార్‌లోని పాలము జిల్లాలో విపరీతమైన కరువు వచ్చింది. సహాయక కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్లిన రాయ్ అక్కడి విపరీత పరిస్థితులు చూసి చలించిపోయాడు. అలాంటి దుర్భర జీవితాలు కూడా ఉంటాయనే విషయం ప్రత్యక్షంగా తెలుసుకున్న రాయ్ నగరాన్ని వదిలేశాడు. విలాస జీవితానికి స్వస్తి పలికాడు. గ్రామాల బాట పట్టాడు. అలా రాజస్థాన్‌లోని తిలోని అనే మారుమూల గ్రామానికి చేరుకున్న రాయ్‌కు అక్కడి స్థానికుడు మేఘరాజ్ స్నేహితుడయ్యాడు. అక్షరం ముక్కరాని మిత్రుడి వద్ద అపారమైన మేధస్సు ఉందని గ్రహించిన రాయ్‌కు తాను ఏంచేయాలో అర్థమైంది. గ్రామాలను పీక్కు తింటున్న పేదరికం, మౌలిక వసతుల సమస్యలకు పరిష్కారం గ్రామీణుల మేధకు అధునాతన సాంకేతిక జోడించి స్వయం సమృద్ధి సాధించడమే ఉత్తమ మార్గం, తేలిక ప్రయత్నం అని తెలుసుకున్నాడు. గాంధీజీ గ్రామస్వరాజ్యానికి అర్థమదేనని నమ్మిన బంకర్ రాయ్ తన పని ప్రారంభించాడు. గ్రామ కమిటీలు వేసి స్థానికులతోనే మంచినీటి సమస్యకు పరిష్కారాలు వెతికాడు. వారికే సాంకేతికతను కలం, కాగితం అవసరం లేకుండానే నేర్పి వర్షపు నీటి నిల్వ రిజర్వాయర్లను, నీటి శుద్ధి కేంద్రాలను రూపొందించాడు. మంచి నీటి లభ్యత మహిళలకు తీరిక దొరికేలా చేసింది. సుదూరాలు వెళ్లి రోజంతా నీటిని మోసే బాధను తగ్గించింది. ఈ అవకాశాన్నే తెలివిగా మలిచాడు బంకర్ రాయ్. పురుషులు టెక్నాలజీ నేర్చితే గ్రామాలు విడిచి అధిక ఆదాయాల కోసం పట్టణాలకు వెళ్లిపోతారు. అదే మహిళలకు నేర్పితే ఇంటితో బాటు గ్రామాన్ని అభివృద్ధి చేస్తారు. ఈ సూత్రాన్నే ప్రతి ప్రాజెక్టులో అమలు చేశాడు.

మహిళలకు పురుషులు, బాలలతోపాటు నైట్ స్కూళ్లను తెరిచాడు. 1990లో సోలార్ ప్రాజెక్టులను చేపట్టి అక్షరం రాని మహిళల్ని అక్షరంతో సంబంధం లేకుండా సోలార్ ఇంజినీర్లుగా మలచడం ప్రారంభించాడు. అణచివేతకు గురౌతున్న గ్రామీణ మహిళలు అలా పురుషులతో సమాన హోదాను అందుకోగలిగారు. గ్రామ పెద్దలుగా మారారు. సతీ సహగమనం, దళిత హక్కులు, స్త్రీ స్వేచ్ఛ, అత్యాచారాలు వంటి అంశాలపై పోరాటాలు జరిపారు. సోలార్ విద్యుద్దీపాలు, కుకర్లతో పాటు నీటి బోరులు, డీసాలినేషన్ ప్లాంట్లు వంటి అనేక సాంకేతిక పనులకు టెక్నీషియన్లంతా నిరక్షరాస్యులుగా అనుకునే మహిళలే. భారత్‌కే పరిమితం కాక బేర్‌ఫుట్ కాలేజీ సేవలు మిగతా పేద దేశాలకు విస్తరించాయి. అక్కడి స్థానిక గ్రామాల నుంచి మహిళలను ఎంపిక చేసి తిలోనాకి తీసుకువచ్చి సోలార్ టెక్నాలజీలో శిక్షణనిస్తారు. ఇక్కడ భాషతో ఇబ్బంది లేకుండా సైగలు, జ్ఞాపకశక్తి ద్వారానే ఎంతటి పెద్ద విషయాన్నైనా నేర్పించే మేధావులున్నారు. వారు కూడా అక్షరం ముక్క నేర్వని మహిళలే. ఈ కాలేజీలో సర్టిఫికెట్లు, డిగ్రీలు ఉండవు. అవి ఉంటేనే విద్యావంతులనే సిద్ధాంతానికి వీరు దూరం. ఈ కాలేజీ అందించిన టీచర్లు వందలాది ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. ఈ కాలేజీలో తయారైన ఆరోగ్య కార్యకర్తలు చాలా గ్రామాలకు వైద్యం చేస్తున్నారు. దంత వైద్యులు, శాస్త్రీయంగా కాన్పులు చేసే మిడ్‌వైఫ్‌లు వందలాది గ్రామాల్లో సేవలు అందిస్తున్నారు. తోలుబొమ్మలాటల రూపంలో ఆరోగ్యకర జీవన విధానంపై ప్రచారం నిర్వహిస్తారు. ఆర్థికంగాను గ్రామాల్ని బలోపేతం చేసేందుకు సంప్రదాయ చేనేత కళలకు అవని హ్యాండిక్రాఫ్ట్స్ పేరిట అంతర్జాతీయ మార్కెట్‌ను సృష్టించారు. ఆన్‌లైన్ విక్రయాలను చాలా ఏళ్లక్రితమే ప్రారంభించేశారు. దలైలామా, అబ్దుల్ కలాం, మార్క్ టుల్లీ, ప్రిన్స్ చార్లెస్, లేడీ డయానా, రిచర్డ్ ఎర్స్, లీలా శ్యాంసన్, జాన్ ఎఫ్ కెన్నడీ జూనియర్‌లాంటి అంతర్జాతీయ నేతలు సందర్శించిన ఈ బేర్‌ఫుట్ కాలేజీలో కూర్చునే బడి బల్లలు, బ్లాక్‌బోర్డులు కనిపించవు. మట్టితో నిండిన నేల మీదే అభ్యాసన. ప్రత్యేక యూనిఫామ్‌లుండవు.

ఇవీ వెలుగులు

లాటిన్ అమెరికా, ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, ఆసియా, దక్షిణ పసిఫిక్ దీవులకు చెందిన జాంజిబార్, బెలీజ్, జోర్డాన్, అఫ్ఘానిస్తాన్ వంటి 64 వెనుకబడిన దేశాల్లోని గ్రామాలకు సౌర విద్యుత్ వెలుగుల్ని అందించింది బేర్ ఫుట్ కాలేజీ. ఎనిమిది దేశాల్లో సుమారు వేయి గ్రామాల్లో 400 వాటర్ ఇంజినీర్లను తయారుచేసింది. 800 నైట్ స్కూళ్లకు తోడు బాల్వాడీలు, బ్రిడ్జ్ స్కూళ్లు, డే స్కూళ్ల ద్వారా 75 వేల మంది పిల్లలకు విద్యనందించింది. ప్రాక్టికల్ బోధనాంశాలకే పెద్ద పీట వేసింది. 14 వేల మంది టీచర్లను అందించింది. ప్రస్తుతం బేర్ ఫుట్ కాలేజీ బడుల్లో 7500 మంది బాలబాలికలు పాఠాలు నేర్చుకుంటున్నారు. 1972లో ఓ టీబీ శానిటోరియాన్ని శిక్షణ శిబిరంగా మార్చుకున్న బేర్‌ఫుట్ కాలేజీ ప్రస్థానం నాలుగు దశాబ్దాలు గడిచేసరికి మిగతా ప్రపంచానికి విస్తరిస్తూ ఎన్నో గ్రామీణ కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. గ్రామవికాసానికి ఓ మంచి మోడల్‌గా నిలిచింది.

ఇంట్లో చింటూకి నెమలి గురించి టీచర్ ఇచ్చిన పేపర్ వర్క్ టక్కున గుర్తొచ్చి మీ దగ్గరకు పరిగెత్తుకొస్తాడు. ఆఫీస్‌లో ప్రెజెంటేషన్‌కు ప్రిపేర్ అవుతున్న మీకు సోదాహరణంగా వివరించేందుకు అర్జెంటుగా మార్స్ ఆర్బిటర్ మిషన్ సమాచారం కావాలి. ఓ కాలేజీ అమ్మడు పర్యావరణ పరిరక్షణపై సెమినార్ ఇవ్వాలి. మరో కాలేజీ కుర్రాడికి ఓ ఫిజిక్స్ ప్రయోగం గురించి తేలిగ్గా చెప్పే పద్ధతి కావాలి. వీరికే కాదు తరగతి గుమ్మం తొక్కని వారి దగ్గర నుంచి పాఠ్య పుస్తకాల పరిధి దాటే మెదళ్ల వరకు అందరికీ కావాల్సిన ఎడ్యుకేషనల్ నాలెడ్జిని ఇంటర్‌నెట్‌లో బోలెడు వెబ్‌సైట్‌లు ఉచితంగా అందిస్తున్నాయి.

ఉచిత ఈ-పాఠశాలలు

అంతర్జాలంలో సముద్రమంత సమాచారం ఉంది. మనం కొన్ని వందల ఏళ్లపాటు నేర్చుకున్నా ఇంకా తరగని విషయాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని జెట్టా బైట్ల సమాచారానికి ఇంకొన్ని ట్రిలియన్ గిగా బైట్ల సమాచారం పోగవుతూనే వస్తోంది. పెన్సిల్ రకాల నుంచి గెలాక్సీల రహస్యాల వరకు ప్రతి సమాచారం దొరికే ఇంటర్‌నెట్‌లో మనకు కావాల్సిన చేపకు గేలమేసి పట్టుకోవడమే కష్టం. ముఖ్యంగా తప్పులు లేకుండా విద్యకు సంబంధించిన సమాచారాన్నిచ్చే వెబ్‌సైట్‌లు ఎంపిక కొంచెం కష్టమే. పేరున్న చాలా ఎడ్యుకేషనల్ వెబ్‌సైట్‌లు రుసుం వసూలు చేస్తుంటాయి. వీటికి భిన్నంగా కొన్ని అపూర్వమైన ప్రాజెక్టులు ఎడ్యుకేషనల్ వెబ్‌సైట్‌ల తీరును మార్చేశాయి. ఉచితంగా అపారమైన జ్ఞానాన్ని అందిస్తూ ఇ-విద్యాలయాలుగా మారుతున్నాయి. చిన్న పాఠాల నుంచి పెద్ద కోర్సుల వరకు అక్కడ పూర్తిచేయొచ్చు.

కోర్సియా.ఆర్గ్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థల సహకారంతో కోర్సియా.ఆర్గ్ వెబ్‌సైట్ రూపొందింది. ఒకే వేదికపై అనేక రకాల టాపిక్స్‌ను అందిస్తోంది. ఉచిత ఆన్‌లైన్ బోధనకు చాలా ప్రభావవంతమైన ఈ సైట్ ఎన్నో మ్యూజియంలు, ట్రస్టులు, విశ్వవిద్యాలయాల నుంచి సమాచారాన్ని క్రోడీకరిస్తోంది. లోతైన విశ్లేషణతో వాటిని పాఠకులకు అందిస్తోంది. కోటి పది లక్షల మంది పైగానే ఇందులో కోర్సులు నేర్చుకుంటున్నారు.

ఖాన్ అకాడమీ

కాలేజీలోకి ప్రవేశించిన వారికి చాలా ఉపయోగకరమైన ఆన్‌లైన్ వేదిక ఖాన్ అకాడమీ. పొందికైన కూర్పుతో పాఠ్యాంశాల్ని పొందుపరిచారు. చాలా కళాశాలలతో పాటు అంతర్జాలంలో మిగతా వేదికలను శోధించి సమాచారాన్ని సేకరించారు. చాలా తేలిగ్గా వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చు.

కల్చర్ లిస్టింగ్

వివిధ విశ్వవిద్యాలయాల ప్రైవేట్ వెబ్‌సైట్లలోని సమాచారాన్ని ఒకే వేదిక తీసుకువచ్చింది కల్చర్ లిస్టింగ్. వైవిధ్యమైన కోర్సుల పక్కా సమాచారాన్ని ఇక్కడ సేకరించొచ్చు. 1000 లెక్చర్స్, వీడియోలు, పాడ్‌కాస్ట్‌ల రూపంలో వీటిని హైలెట్ చేశారు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, అమెరికా వంటి ఎన్నో దేశాల విశ్వవిద్యాలయాల కోర్సుల్లోని సమాచారాన్ని పొందవచ్చు.



అకడమిక్ ఎర్త్

ప్రొఫెసర్ల సహకారంతో రూపొందిన ఈ అకడమిక్ ఎర్త్ వెబ్‌సైట్‌లో ఒక్కో సబ్జెక్ట్ మీద వివరణాత్మకమైన సమాచారం దొరుకుతుంది. కావాల్సిన పాఠ్యాంశాల్ని తేలిగ్గా ఇక్కడ సంపాదించొచ్చు.

ఇడిఎక్స్

ఉచిత ఆన్‌లైన్ విద్య ప్రమాణాలు పెంచేలా ఇడిఎక్స్ వెబ్‌సైట్ నాణ్యమైన సమాచారాన్ని అందిస్తోంది. ఎన్నో విస్తారమైన అంశాలను సరళమైన శైలిలో అందుబాటులో ఉంచింది. ఎన్నో ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల కోర్సులన్నిటిని ఇక్కడ నేర్చుకోవచ్చు.

అలీసన్

కేవలం ఆన్‌లైన్ విద్యాబోధనే కాక సంబంధిత కోర్సులకు సర్టిఫికెట్లను కూడా ఇస్తోంది అలీసన్. ఎంపిక చేసిన అంశాలపై ప్రత్యేక ఆన్‌లైన్ పరీక్షల ద్వారా లెర్నర్స్ ప్రతిభను అంచనా వేసి సర్టిఫికెట్లను ఇస్తోంది. వాణిజ్య, సాంకేతికత, ఆరోగ్యంతో పాటు వివిధ భాషలపై కోర్సులు ఉన్నాయి.

హార్వార్డ్ ఎక్స్‌టెన్షన్ ద్వారా ప్రఖ్యాత హార్వార్డ్ విశ్వవిద్యాలయం ఉచితంగా కోర్సులను ఆన్‌లైన్‌లో అందిస్తోంది. కేవలం హార్వార్డ్‌లో మాత్రమే దొరికే కోర్సులు కూడా ఇక్కడ చదవొచ్చు. హార్వార్డ్ సర్టిఫికెట్ ఇచ్చే కోర్సులు కూడా ఉన్నాయి.

యేల్ ఓపెన్

యేల్ విశ్వవిద్యాలయం తరగతి గదుల్లో నేర్పే కోర్సులను వీక్షిస్తూ నేర్చుకోవడానికి యేల్ ఓపెన్ ఉపయోగపడుతోంది. వీడియోల రూపంలో తరగతి గది పాఠాలను ఉచితంగా అందుబాటులో ఉంచుతోంది. క్యాంపస్ కోర్సులను ఇంటి నుంచే నేర్చుకోవచ్చు.

ఎంఐటీ ఓపెన్‌కోర్స్‌వేర్

ప్రసిద్ధ ఎంఐటీ విశ్వవిద్యాలయం కూడా ఉచిత కోర్సులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. లెర్నర్స్ తేలిగ్గా నేర్చుకునేందుకు ఆర్ఎస్ఎస్ ఫీడ్ సౌలభ్యం కూడా ఉంది. చాలా లోతైన సమాచారాన్నిచ్చే మెటీరియల్‌ను ఉచితంగా అందుకోవచ్చు. వీటితో పాటు కార్నెగీ మెల్లన్ ఫ్రీ ఆన్‌లైన్, స్టాన్‌ఫర్డ్ ఓపెన్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ ఆక్స్‌ఫర్డ్ పాడ్‌క్యాస్ట్, వంటి సైట్‌లు

ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల తలుపుల్ని ఆన్‌లైన్‌లో తెరిచాయి.

కేవలం కంప్యూటర్ కోడింగ్ కోసమే ఉచితంగా కోర్సులను అందిస్తోంది కోడ్ అకాడెమీ. మిగతా కోడింగ్ వెబ్‌సైట్‌ల్లా కేవలం ప్రాక్టీస్ సెషన్ వర్క్‌ఫ్లోకే పరిమితం కాకుండా లైవ్ ప్రాక్టీస్ విండోను రూపొంది ంచింది. పాఠ్యాంశ మెటీరియల్‌ను చూస్తూ కోడింగ్‌ను ప్రాక్టీస్ చేసేందుకు ఇది వీలు కల్పిస్తోంది. తర్వాతి కోర్సు మాన్యువల్‌గా ఎంచుకోకుండా కంప్యూటర్ లాంగ్వేజ్‌ను పూర్తిగా నేర్చుకునేలా సెంట్రలైజ్డ్ డాష్‌బోర్డ్‌లను ఏర్పాటుచేసింది.

కోడ్

పిల్లలు కూడా తేలిగ్గా కోడింగ్ నేర్చుకునేలా ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. యాప్ డిజైనింగ్, రోబోటిక్స్, జావా స్క్రిప్ట్‌లపై కోర్సులున్నాయి. తరగతి గదికి అనుకూలంగా సెట్టింగ్స్ మార్చుకోవచ్చు.

డ్యూవోలింగో

విదేశీ భాషల్ని నేర్చుకునే తీరులో విప్లవాత్మకమైంది డ్యూవోలింగో వెబ్‌సైట్. వివిధ వర్గాల వారికి ప్రత్యేకించి కోర్సులను అందిస్తోన్న డ్యూవోలింగో బిగినర్స్ నుంచి ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారి స్థాయి వరకు అనేక కేటగిరీల్లో కోర్సులను అందిస్తోంది. పదాన్ని పలికే తీరు తెలిపే శబ్దం, టెక్స్ట్ ట్రాన్స్‌లేషన్, విజువల్స్‌తో విదేశీ భాషల్ని నేర్చుకోవడం తేలిక చేసింది. ఓ ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎక్కడి నుంచి కోర్సు మొదలెట్టాలో కూడా తెలుపుతుంది.

మైక్రోసాఫ్ట్ వర్చువల్ అకాడెమీ

ఐటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అనేక అంశాలపై కోర్సులను అందిస్తోంది. లైవ్ ఈవెంట్స్, 2డీ గేమ్ ప్రోగ్రామింగ్‌లపై ట్యుటోరియల్స్‌తో సహా చాలా విషయాలు ఇక్కడ నేర్చుకోవచ్చు.

నేషనల్ జాగ్రఫిక్ కిడ్స్

పిల్లల కోసమే రూపొందించబడిన ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ వేదిక ఇది. గేమ్స్, పజిల్స్, వీడియోలు, ఫొటోల రూపంలో చాలా ఆసక్తికరంగా పాఠాల్ని బోధిస్తుంది ఈ వెబ్‌సైట్. కోర్సుల రూపంలో కాక పాఠ్యాంశం, మాధ్యమం రూపంలో మెటీరియల్‌ను అందిస్తోంది. ఇదే కాక ఫన్‌బ్రెయిన్, వైవిల్లేలు కూడా పిల్లలకు సంబంధించినవే. వైవిల్లే పెద్ద పిల్లలకు బాగా ఉపయోగకరం.

టెడ్ ఎడ్

కట్టిపడేసే యానిమేషన్‌తో కేవలం పది నిమిషాల చొప్పున ఉండే వీడియోలతో చాలా ఆహ్లాదకరంగా ఉంటాయి దీనిలోని క్లాసులు. కేవలం వీడియోల బోధనకే కాక సప్లిమెంటల్ మెటీరియల్, క్విజ్‌లు కూడా ఉంటాయి. టెక్స్ట్ రూపంలో కాక వీడియోల రూపంలో మరింత మక్కువ పెంచేలా బోధన అందించే వెబ్‌సైట్‌లు చాలా ఉన్నాయి. బిగ్ థింక్.కామ్, బ్రైట్ స్టార్మ్.కామ్, కాస్మో లెర్నింగ్.కామ్, ఆర్కైవ్.ఆర్గ్, లెర్నర్.ఆర్గ్, మ్యాథ్‌టీవీ.కామ్, స్కూల్‌ట్యూబ్.కామ్, టీచర్‌ట్యూబ్.కామ్, స్కూల్స్‌వరల్డ్.టీవీ, బ్రెయిన్‌పాప్.కామ్‌లు ఈ కోవలోకి చెందినవే.

ఆకాశ హర్మ్యాలు

- సుబ్రహ్మణ్యం వి.ఎస్.కూచిమంచి, 8008551231

అద్భుత కథ

ఎత్తయిన కట్టడాలు మనిషిని ఎప్పుడూ ఆకర్షిస్తూనే ఉంటాయి. వంద మీటర్ల కంటే ఎత్తయిన నిర్మాణాలు పారిశ్రామీకరణకు ముందే రూపొందాయి. ప్రపంచంలో ఎత్తయిన భవనాలు ఎలా రూపొందాయి. ఎన్నున్నాయి? చరిత్రలో వాటి ప్రాముఖ్యత ఏమిటి? అనే అంశాలు ఎప్పటికీ ఆసక్తికరమే. తరాలతో పాటే అవీ మారుతున్నాయి. ఎత్తుతో పాటు సాంకేతికతను మెరుగుపరచుకుంటూ కళ్ళు చెదిరేలా కట్టించిన వాడి కళ్ళు చెమర్చేలా చేస్తున్నాయి. క్రీస్తుకు పూర్వం 2620 – 2500 సంవత్సరాల మధ్య పిరమిడ్ ఆఫ్ ఖుఫు ప్రపంచంలోనే ఎత్తయిన పిరమిడ్‌గా పేరు పొందింది. దీని ఎత్తు 139 మీటర్లు. అనంతరం ఫారోస్ ఆఫ్ అలెగ్జాండ్రియా పేరుతో రూపొందించిన దీప స్తంభం 20 వ శతాబ్దం వరకూ సగర్వంగా తానే గొప్పని చాటిచెప్పింది. దీనికి ముందు నిర్మించిన టవర్ ఆఫ్ బాబెల్ 19వ శతాబ్దంలో పవిత్ర భవనాల్లో ఒకటిగా నిలిచింది. స్వర్గానికి నిచ్చెన వేసిన భవంతిగా పేరొందింది. క్రమేణా ఎత్తయిన భవనాల నిర్మాణం కార్యాలయాలు, నివాస గృహాలకూ పాకింది.

హోం ఇన్సూరెన్సు తొలి ఎత్తైన భవంతి

నింగిని అందుకునేలా చేసిన మొదటి ప్రయత్నానికి ఎలీషా గ్రేవ్ ఓటిస్ అనే కంపెనీ రూపొందించిన ఎలివేటర్ (లిఫ్ట్) ఆలంబనగా నిలిచింది. ఆరంతస్తులతో ఈ ప్రయత్నం మొదలైంది. ఇంత ఎక్కువ ఎత్తులో నివసించడానికి అద్దెకు తీసుకునే వారు ఎవరూ ముందుకు రాకపోవడంతో సమస్య తీవ్రత తెలిసింది. ఈ సమస్యకు ఓటిస్ ఎలివేటర్ పరిష్కారాన్ని చూపింది. ఉక్కు కడ్డీలను భవంతుల నిర్మాణంలో ఉపయోగించడం స్కైస్క్రేపర్లకు కీలకమైంది. చికాగోలోని హోం ఇన్సూరెన్సు భవంతిని ఈ విధానంలో తొలిసారిగా నిర్మించారు. 1885లో దీనికి రూపకల్పన చేశారు. 55 మీటర్ల ఎత్తులో పది అంతస్తులు కట్టారు. ప్రపంచంలోనే తొలి పెద్ద భవనమిది. ఆకాశ హర్మ్యాలకు ఇది పునాది వేసింది. టవర్ల నిర్మాణంలో ఈ భవంతి సరికొత్త చరిత్రను సృష్టించింది. న్యూయార్క్ హోం ఇన్సూరెన్స్ కంపెనీ తన కేంద్ర కార్యాలయం కోసం దీన్ని నిర్మించుకుంది. ఉక్కు స్తంభాలు, రాతితో కట్టడం ప్రారంభించిన తరవాత కొన్నాళ్ళకు ఈ ప్రాజెక్టును నిలిపేశారు. ఇంత ఎత్తున కట్టే ఈ భవంతి కూలిపోకుండా నిలబడుతుందా లేదా అనే అంశాన్ని నిర్ధారించుకోడానికి ఈ చర్య తీసుకున్నారు. దీని నిర్మాణం కోసం గ్రేట్ చికాగో ఫైర్ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో మూడు చదరపు మైళ్ళ పరిధిలోని చెక్క భవంతులను కాల్చి బూడిద చేశారు. హోం ఇన్సూరెన్స్ భవంతిని ఫస్ట్ చికాగో స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌గా కూడా పరిగణిస్తారు. విలియమ్ లె బేరన్ జెన్నీ దీనికి రూపకల్పన చేశారు.

ఫిలడెల్ఫియా సిటీ హాల్ (1901-1908)

అమెరికాలో నిర్మించిన ఫిలడెల్ఫియా సిటీ హాల్ 167 మీటర్ల ఎత్తులో సగర్వంగా తన ఘనతను చాటుకుంది. భవంతి పైన నిర్మించిన బెల్ టవర్ ఇప్పటికీ కన్నులను మిరుమిట్లు గొలుపుతుంది. ఇందులో స్టీలును ఉపయోగించకపోవడం విశేషం. రాతితో కట్టిన ఎత్తయిన భవనం ఇప్పటికీ ఇదే. 24 మిలియన్ డాలర్లు దీనికి ఖర్చయ్యింది. 700 గదులు ఇందులో ఉన్నాయి. 6.7 మీటర్ల ఎత్తు ప్రహరీ

విమానంలో ఎగురుతూ నేలను చూడడం ఓ వింత అనుభవం. గాలిలో తేలిపోవడాన్ని మించిన మధురూహ మరోటి ఉండదు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వం మనుషులకుంటుందేమో కానీ.. భవనాలకు ఉండదు కదా. అందుకే అవి గర్వంగా తలెత్తుకునే ఉంటాయి. వాటిని చూడడానికి మనం మెడలు నొప్పెట్టేలా వెనక్కి వంచి చూడాల్సిందే. పగలు ఆకాశం అంచును ముద్దాడుతున్నట్లూ, రాత్రి చుక్కల్ని అందుకుంటున్నట్లూ విభ్రాంతిని కలిగిస్తాయి. అచ్చెరువొందిస్తాయి. అంతస్తుల మీద నిర్మించిన అంతస్తులు ఆకాశానికి నిచ్చెనలు వేసినట్లు అనిపించక మానదు. అంతెందుకు... మన దేశానికి టెలివిజన్లు వచ్చిన కొత్తలో వాటికి యాంటెన్నాలను 15 నుంచి 20 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయడం గుర్తుచేసుకోండి. ఇదంతా ఒక ఎత్తయితే.. భవంతుల నిర్మాణం మరొకెత్తు.

బుర్జ్ ఖలీఫా

ఉంది. దీనికి ముందు ఉన్నవన్నీ మత పరమైన భవనాలే. సెక్యులర్ విధానంలో నిర్మించిన తొలి భవనమూ ఇదే కావడం విశేషం. 1950లోనే దీనిని కూలగొట్టాలని భావించారు.కానీ అందుకయ్యే ఖర్చు ఫిలడెల్ఫియా మున్సిపాలిటీని దివాళా తీయిస్తుందని తేలడంతో ఆ ఆలోచనను విరమించుకున్నారు. 1871లో దీని నిర్మాణం ప్రారంభమైంది. 6లక్షల 30 వేల అడుగులలో దీనిని కట్టారు. దీని నిర్మాణంలో సున్నపు రాయి, గ్రానైట్, పాలరాయిని ఉపయోగించారు. 2007లో అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ జాబితాలో ఇది 21వ స్థానాన్ని పొందింది. స్కాటిష్ ఆర్కిటెక్ట్ జాన్ మెక్ ఆర్థర్ జూనియర్ దీన్ని రూపొందించారు. 1901 వరకూ భవనం లోపలి భాగం పూర్తికాలేదు. అమెరికాలోని పెద్ద మున్సిపల్ భవనం ఇదే. ఇందులో పరిపాలన విభాగం, మేయర్ కార్యాలయం, సివిల్ కోర్టుల ప్రాంగణం ఉన్నాయి. భవంతి పైన 11.3 మీటర్ల ఎత్తయిన ఫిలడెల్ఫియా వ్యవస్థాపకుడు విలియమ్ పెన్‌కు చెందిన 37 అడుగుల కంచు విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఒక భవనం మీద ప్రతిష్టించిన పొడవైన విగ్రహం ఇదే. దీనితో పాటు 26 అడుగుల వ్యాసార్థం గల గడియారాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇది నగరం నలు దిక్కులకూ కనిపిస్తుంది. జాతీయ చారిత్రక కట్టడంగా దీన్ని గుర్తించారు.

సింగర్ బిల్డింగ్ (1908-1909)

కుట్టు పని తెలుసున్న ప్రతి ఒక్కరి నోట పలికే మాట 'సింగర్'. ఆ కంపెనీ కట్టిన భవంతే ఇది. సింగర్ బిల్డింగ్ కట్టేంత వరకూ సిటీ హాల్ తలెత్తుకు నిలబడింది. సింగర్ బిల్డింగ్ ఎత్తు 187 మీటర్లు. న్యూయార్క్ నగరంలో దీన్ని నిర్మించారు. నాలుగేళ్ళ పాటు ఇది తన ఘనతను నిలుపుకుంది. 47 అంతస్తులు ఇందులో ఉన్నాయి. వన్ లిబర్టీ ప్లాజాను నిర్మించే నిమిత్తం 1968లో సింగర్ బిల్డింగ్‌ను కూలగొట్టారు. ప్రపంచంలో ఇంతవరకూ కూలగొట్టిన ఏకైక ఎత్తయిన భవనంగా నిలిచింది. 1906 జులై 22న ఈ భవంతి నిర్మాణానికి సంబంధించిన వార్త న్యూయార్క్ డెయిలీ ట్రిబ్యూన్ పత్రికలో వచ్చింది. న్యూయార్క్ వచ్చే ప్రతి ఒక్కరూ దాన్ని చూడాలని తపిస్తారని అందులో పేర్కొన్నారు. అప్పట్లో దీనికి లక్షన్నర డాలర్లు ఖర్చవుతాయని కూడా తెలిపింది. ఫ్లాగ్ ఈ భవంతి నిర్మాణ ప్రణాళికను రచించారు. ఇంత భవనం కడితే, పరిసరాలకు సూర్య కాంతి తగ్గిపోతుందని స్థానికులు ఆందోళన చెందారు. వాటికి తెర దించుతూ ఆయన ఈ టవర్ను రూపుదిద్దారు. ఫిలడెల్ఫియా సిటీ హాల్ కంటే ఇది 60 అడుగుల ఎత్తులో ఉంటుందని న్యూయార్క్ టైమ్స్ రాసింది. ఇది పూర్తి కావడానికి రెండేళ్ల సమయం తీసుకుంది. జనవరి 2, 1907 నాటికి భవనం ఆకృతిని సంతరించుకుంది. ఎర్రటి ఇటుకలనూ, పునాదిలో 1500 క్యూబిక్ అడుగుల నీలి రంగు రాయిని ఉపయోగించారు. 42 లక్షల 80 వేల పౌండ్ల విలువైన సున్నపు రాయిని దీని నిర్మాణం కోసం ఖరీదు చేశారు. న్యూజెర్సీ టెర్ర కోటా కంపెనీ నుంచి బాల్కనీల రూపకల్పనకు టెర్రకోట మెటీరియల్‌ను కొనుగోలు చేశారు. ఇది పూర్తి కాక మునుపే అందరి దృష్టినీ ఆకర్షించడం మొదలుపెట్టింది. ఈ భవంతి ముఖద్వారం వద్ద 24 అడుగుల ఎత్తయిన ఇత్తడి కటకటాలను ఏర్పాటుచేశారు. పాలరాతి స్తంభాలపై 3600 ఇత్తడి రేకులను తాపడం చేశారు. సింగర్ ట్రేడ్ మార్క్‌ను సూచిస్తూ 80 ఇత్తడి పతకాలను ఏర్పాటుచేశారు. లిఫ్ట్ తలుపులు, మెట్లపై రెయిలింగ్, బాల్కనీలు, కార్యాలయ ద్వారాలు, గడియారం, లాబీలోని మెట్లు మొత్తం ఇత్తడితోనే నిర్మించారు. ఆభరణాలకోసం వినియోగించే ఇత్తడి 38 టన్నులను దీనికోసం వాడారు. భవనం మొత్తంలో 136 మైళ్ళ పొడవైన తీగలను వినియోగించారు. ఈ భవంతిలో వినియోగించిన టెర్రకోట మెటీరియల్‌ను బహిరంగంగా పరిస్తే 8.96 ఎకరాల విస్తీర్ణం ఉంటుందని అంచనా. ఒక చివరి నుంచి మరొక చివరకు పొడుగు 97 మైళ్ళుంటుందని తేలింది. 18 నెలల పాటు ఈ భవంతి ప్రపంచంలోనే ఎత్తయిన భవనంగా నిలిచింది. 1908 జూలై 1న 42వ అంతస్తులో సందర్శకుల టవర్‌ను ప్రారంభించారు.

మెట్రోపాలిటన్ లైఫ్ టవర్ (1909-1913)

దీనిని కూడా న్యూయార్క్‌లోనే నిర్మించారు. ఎత్తు 213 మీటర్లు. అంతస్తులు 50. దీన్ని మెట్ లైఫ్ టవర్ అని కూడా పిలుస్తారు. నెపోలియన్ లెబ్రూన్ దీనికి రూపకల్పన చేశారు. ప్రస్తుతం ఇందులో న్యూయార్క్ ఎడిషన్ హోటల్ నిర్వహిస్తున్నారు. పెరిగిన నూతన సాంకేతిక విలువలకు ఇది నిలువుటద్దంలా నిలుస్తోంది. ఫైర్ ప్రూఫ్, వేడిమి, ప్లంబింగ్, తదితర అంశాలలో వినూత్నమైన పద్ధతుల్ని ఇందులో ప్రవేశపెట్టారు. ఖనిజాలేమీ ఉపయోగించకుండా కేవలం కాంక్రీట్ ఆధారంగా రూపొందించిన గడియారాలను భవంతికి నలువైపులా అమర్చారు. లోపలి భాగంలో పైకి కనిపించేలా తెలుపు, నీలం రంగు మొజైక్‌ను అలంకరించారు. పిరమిడ్ ఆకారంలో ఉన్న కప్పు దీనికి అదనపు ఆకర్షణగా నిలిచింది. 600 అడుగుల్ని 60 సెకన్లలో అధిగమించగల కొత్త లిఫ్టులను ఓటిస్ కంపెనీ తయారు చేసి, ఇందులో అమర్చింది. 1964లో చేపట్టిన మరమ్మతులు ఇందులోని పాత జ్ఞాపకాలను తుడిచిపెట్టేశాయి. మన్‌హటన్‌లోని మాడిసన్ అవెన్యూ సమీపంలో ఈ భవంతి ఉంది. 1893లో ప్రారంభించిన ఈకట్టడం, 1903లో పూర్తయింది. మెట్రోపాలిటన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రెసిడెంట్ జాన్ రోజర్స్ హేగ్‌మాన్ ఈ టవర్స్‌ను నిర్మించే బాధ్యతను 1907లో లెబ్రూన్‌కు అప్పగించారు. తొలుత 658 అడుగుల ఎత్తు మాత్రమే నిర్ణయించుకున్నప్పటికీ, దాన్ని 700 అడుగులకి పెంచారు. మరమ్మతుల అనంతరం పాత జ్ఞాపకాలుగా టవర్‌కు నలువైపులా ఉన్న గడియారాలు మాత్రమే మిగిలాయి.

ఊల్‌వర్త్ భవనం (1913-1930)

భూకంపాలను తట్టుకునేలా రూపొందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దీని నిర్మాణానికి వినియోగించారు. 1930 వరకూ ఈ భవనం అతి ఎత్తయినదిగా నిలిచింది. ఎత్తు 241మీ. అంతస్తులు 57. ఇందులో 34 లిఫ్టులను ఏర్పాటుచేశారు. ఇది కూడా న్యూయార్క్‌లోనే ఉంది. అప్పట్లో ఫ్రాంక్లిన్ విన్‌ఫీల్డ్ ఊల్‌వర్త్ దీని నిర్మాణానికి 13.5 మిలియన్ అమెరికన్ డాలర్లు ఖర్చుచేశారు. ఈ కారణంగా దీనికి ఆయన పేరు పెట్టారు. అమెరికాలోని వంద ఎత్తయిన భవంతులలోనూ, న్యూయార్క్‌లోని 20 అత్యున్నత భవనాలలోనూ ఒకటిగా నిలిచిందీ ఊల్‌వర్త్. 1966 నుంచి జాతీయ స్థాయి, 1983 నుంచి న్యూయార్క్ స్థాయి చిహ్నంగా నిలిచింది.

సింగర్ బిల్డింగ్

కాస్ గిల్బర్ట్ దీనికి రూపకల్పనచేశారు. 1910లో ప్రారంభించిన దీని నిర్మాణం 1913 పూర్తయ్యింది. యూరోపియన్ గోతిక్ కెథడ్రల్ నిర్మాణాన్ని ఇది పోలి ఉంటుంది. భవంతిలోని 50వ అంతస్తులో ఏర్పాటు చేసిన సందర్శకుల వేదిక 1941 వరకూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లోపలి గోడలను టెర్రకోటతో అలంకరించారు. పిరమిడ్ క్యాప్‌కు చుట్టూ చేసిన అలంకరణ ప్రత్యేకతగా నిలిచింది. నిర్మాణం పూర్తయిన తరవాత ఊల్‌వర్త్ కంపెనీ ఒకటిన్నర అంతస్తులను మాత్రమే ఉపయోగించుకుంది. మిగిలిన భాగాన్ని అద్దెకు ఇచ్చేసింది. ఇర్వింగ్ నేషనల్ ఎక్స్ఛేంజి బ్యాంక్, కొలంబియా రికార్డ్స్ ఇందులో అద్దెకున్నాయి. 1998లో అంటే కట్టిన 85 ఏళ్ళకు 155మిలియన్ డాలర్లకు దీన్ని విట్‌కాఫ్ గ్రూప్‌కు విక్రయించింది. స్పోర్ట్స్ షూస్ విక్రయించే కంపెనీ రూపంలో ఊల్‌వర్త్ తన ఉనికిని ఈ

భవంతిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో పదిలం చేసుకుంది. వరల్డ్ ట్రేడ్ సెంటర్ పైనుంచి ఊల్‌వర్త్ భవంతిని సందర్శకులు ఫొటోలు తీసేవారు. పర్యాటక ఆకర్షణగా నిలిచిన ఈ భవంతికి వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి అనంతరం ఏర్పాటుచేసిన రక్షణ కూడా ప్రతిబంధకంగా నిలిచింది. 20వ శతాబ్దం ప్రారంభంలో ఈ భవంతి ఉన్నత విద్యకూ, ఫోర్డమ్ విశ్వవిద్యాలయ పాఠశాలలకూ ఆశ్రయమిచ్చింది. 2012లో అల్‌కెమీ ప్రోపర్టీస్ అనే సంస్థ ఈ భవంతి పైభాగంలోని 30 అంతస్తులను 68 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. వీటిని లగ్జరీ అపార్ట్‌మెంట్లుగా రూపుదిద్దేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

ది ట్రంప్ బిల్డింగ్(1930-1930)

దీని ఎత్తు 283 మీ. అంతస్తులు 71. దీనిని కూడా న్యూయార్క్ నగరం సొంతం చేసుకుంది. దీనిని తొలుత బ్యాంక్ ఆఫ్ మన్‌హటన్ కంపెనీ బిల్డింగ్ అని పిలిచే వారు. ఏడాది లోపే దీని నిర్మాణాన్ని పూర్తిచేశారు. అప్పటికి ఇదే ప్రపంచంలో ఎత్తయిన భవనం. ఈ దశాబ్దం మొత్తం న్యూయార్క్ సిటీ ఎత్తయిన భవనాలు కలిగిన నగరంగా పేరు తెచ్చుకుంది. ఇందులో 36 ఎలివేటర్లను ఏర్పాటుచేశారు. 1928లో మన్‌హటన్ భవంతి నిర్మాణం తరవాత, ప్రపంచంలోనే ఎత్తయిన భవనాల నిర్మాణంలో పోటీ మొదలైంది. ఫలితంగా ఎదుటివాడు కట్టేదానికి మరింత ఎత్తులో భవంతులను రూపొందించసాగారు. అలా రూపొందించిందే ఈ భవంతి. కానీ ఏడాది కూడా దీనికి ఆ ఖ్యాతి మిగల్లేదు. 1946 మే 20వ తేదీ సాయంత్రం అమెరికన్ ఆర్మీ విమానం ఈ భవంతికి ఉత్తరం వైపు ఢీకొట్టింది. 58వ అంతస్తును ఇది తాకింది. ఈ ప్రమాదంలో భవంతికి 20 అడుగుల పొడవు, పదడుగుల వెడల్పులో రంధ్రం పడింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఐదుగురూ మరణించారు. విమాన శకలాలు, భవంతి నుంచి ఇటుకలు, తదితరాలు రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో 2వేల మంది భవంతిలో పని చేస్తున్నారు. ఎవరికీ గాయాలు కాలేదు. న్యూయార్క్ చరిత్రలో ఇటువంటి ఘటన ఇది రెండోది. 1995లో ఈ భవంతిని డోనాల్డ్ ట్రంప్ కొనుగోలు చేశారు. అప్పటి వరకూ 40 వాల్‌స్ట్రీట్‌గా ఉన్న దీని పేరు ది ట్రంప్ బిల్డింగ్‌గా మారిపోయింది. 2003లో దీన్ని విక్రయించడానికి ప్రయత్నించారు. 300మిలియన్ డాలర్లను ఆశించారు. కానీ సాధ్యం కాలేదు. 2005, నవంబర్ 17న సి.ఎన్.బి.సిలో ఈ అంశం ప్రసారమైంది. 1998లో దీనికి ల్యాండ్‌మార్క్ ఆఫ్ న్యూయార్క్‌గా గుర్తింపు లభించింది.

క్రిస్లర్ భవనం (1930-1931)

ట్రంప్ బిల్డింగ్ ఎత్తయిన భవనం హోదాను కొద్ది వారాల్లోనే కోల్పోయింది. దానికి కారణం న్యూయార్కులోనే కట్టిన క్రిస్లర్ భవనం. దీని ఎత్తు 319మీ. అంతస్తులు 77. వాల్టర్ క్రిస్లర్ దీనిని కట్టించారు. ఈఫిల్ టవర్ స్ఫూర్తిగా ఆయన ఈ భవన నిర్మాణానికి పూనుకున్నారు. ప్రపంచంలోనే ఎత్తయిన భవనాన్ని నిర్మించాలన్న ఆలోచన ఆయనకు ఈఫిల్ టవర్‌ను చూసిన తరవాత కలిగింది. ఆర్కిటెక్ట్ విలియం వాన్ అలెన్ సహాయంతో దీనిని చేపట్టారు. ఇందులో అతి ముఖ్యమైన అంశం ఎలివేటర్. 56 మీటర్ల పొడవున్న శిఖరాన్ని భవంతిపైకి చేర్చడానికి దీనిని ఏర్పాటు చేశారు. ముక్కలుగా చేసి తెచ్చి, బిగించిన అనంతరం.. ఈ శిఖరాన్ని కేవలం 90 నిముషాల్లో ఈ ఎలివేటర్ సాయంతో పైకి చేర్చి ప్రపంచాన్ని ఆశ్చర్య చకితుల్ని చేశారు. ఇందులో రెండు భవనాలున్నాయి. ఒకటి క్రిస్లర్ బిల్డింగ్, రెండోది క్రిస్లర్ ఈస్ట్. 1930 నిర్మించిన ఈ భవంతిని 1998లో విక్రయించారు. అప్పుడు దీని ఆధునికీకరణను చేపట్టారు. ఇందులో అద్దెకు ఇచ్చే ఏరియాను 20, 62, 772 చదరపు అడుగులకు పెంచారు.

ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ (1931-1972)

దీని ఎత్తు 381 మీటర్లు. అంతస్తులు 102. 86వ, 102వ అంతస్తుల్లో ఏర్పాటుచేసిన పరిశీలన వేదికలు.. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ సార్లు దర్శించిన స్థలాలుగా రికార్డుకెక్కాయి. ఇందులో 73 లిఫ్టులున్నాయి. ఈ భవంతిని 18 నెలల్లో పూర్తిచేశారు. దీనిని ప్రపంచంలోని ఎనిమిదో వింతగా పరిగణిస్తారు. కింగ్ కాంగ్, ఇండిపెండెన్స్ డే చిత్రాలకు ఈ భవంతిని వినియోగించారు. 41 సంవత్సరాల పాటు ఈ భవంతి అత్యంత ఎత్తయినదిగా పేరును నిలబెట్టుకుంది. ఇంత ఎక్కువ కాలం రికార్డును నిలబెట్టుకున్న భవంతి ఏదీ లేదు. న్యూయార్క్‌కు ఈ భవంతి పర్యాయపదంగా మారింది. అమెరికాలో ఐదో ఎత్తయిన భవంతిగానూ, ప్రపంచంలో 25వది గానూ గుర్తింపు పొందింది. అమెరికా సంస్కృతికి ఈ భవంతిని గుర్తుగా పరిగణిస్తారు. దీని నిర్మాణ వ్యయం 4,09,48,900 డాలర్లు. 2015లో దీన్ని నిర్మించాలంటే 635 మిలియన్ డాలర్లు ఖర్చయ్యేది. 2010లో దీన్ని 550 మిలియన్ డాలర్లను ఖర్చు చేసి ఆధునికీకరించారు. ఇందులో 120 మిలియన్ డాలర్లను భవంతికి పటిష్ఠతకు వినియోగించారు. మార్చి 17, 1929న మొదలుపెట్టిన నిర్మాణం ఏప్రిల్ 11 1931న పూర్తయ్యింది.

మనమూ తక్కువేం కాదు...

అంత ఎత్తుకు ఎదగకపోయినా భారత్ కూడా ఎత్తయిన భవనాల నిర్మాణంలో తన వంతు కృషి చేస్తోంది. వరల్డ్ వన్ పేరుతో ఒక పొడవాటి భవనాన్ని నిర్మిస్తోంది. 2016కు ఇది పూర్తికాగలదని అంచనా. అప్పటికి ఇదే భారత్‌లో ఎత్తయిన భవంతి కాగలదు. ఇది పూర్తిగా నివాసానికి ఉపయోగించే భవనం. ముంబయిలో నిర్మిస్తున్న ఈ భవంతి ఎత్తు 442 మీటర్లు (1,450 అడుగులు). అంతస్తులు 117. ఇందులో మొత్తం 25 ఎలివేటర్లుంటాయి. లోధా గ్రూప్ ఈ ప్రాజెక్టును చేపట్టింది. 2011లో ఇది ప్రారంభమైంది. 20 బిలియన్ అమెరికన్ డాలర్లు ఖర్చవుతాయని అంచనా. ఇదే సంస్థ వరల్డ్ వ్యూ, వరల్డ్ 17.5 ఎకరాలలో దీనిని ప్రారంభించారు. క్రెస్ట్ అనే మరో రెండు ప్రాజెక్టులను కూడా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ఇంపీరియల్ టవర్ -1 భవనం ప్రస్తుతానికి అత్యంత ఎత్తైనది. ఎత్తయిన భవనాల అంశంలో ముంబైదే ప్రముఖ స్థానం. దేశ వాణిజ్య రాజధాని కావడం.. హిందీ చలన చిత్ర పరిశ్రమ ఇక్కడ కేంద్రీకృతం కావడం దీనికి ప్రధాన కారణం. దేశంలో మొత్తం 92 ఎత్తయిన భవనాలున్నాయి. వాటిలో 78 భవనాలు ముంబైలోనే ఉన్నాయి. మిగిలిన వాటిలో కోల్‌కతాలో 8, బెంగళూరులో 1, మంగుళూరులో 1, హైదరాబాద్‌లో 4 ఉన్నాయి. వీటిలో అధికభాగం నివాసాల కోసం నిర్మించినవే. వాణిజ్యం కోసం, హోటళ్ళ కోసం నిర్మించినవి ఏడు భవంతులున్నాయి. స్వీయ అవసరాల కోసం నిర్మించుకున్న భవంతి మాత్రం ఒకే ఒక్కటి. అదీ ప్రముఖ వ్యాపారవేత్త అనీల్ అంబానీకి చెందింది.

ఎత్తయిన భవనాలలో ఇది 30వ స్థానాన్ని ఆక్రమిస్తోంది. ఈ భవంతిని 173 మీటర్ల ఎత్తున నిర్మించారు. ఇందులో 27 అంతస్తులున్నాయి. అట్లాంటిక్ సముద్రంలోని ఓ దీవి అంటిలియా పేరును దీనికి పెట్టారు. చికాగోకు చెందిన పెర్కిన్స్ విల్ దీనిని డిజైన్ చేశారు. ఆస్ట్రేలియాకు చెందిన లీటన్ హోల్డింగ్స్ కంపెనీ దీనిని ప్రారంభించింది. వాస్తవానికి ఇందులో 60 అంతస్తులు కట్టచ్చు. రిచ్టర్ స్కేలుపై 8 పాయింట్లు తీవ్రతతో వచ్చే భూకంపాన్ని సైతం ఇది తట్టుకుంటుంది. ఈ భవంతిపై మూడు హెలిప్యాడ్‌లు కూడా ఉన్నాయి. కానీ వాయు సేన దీనికి అభ్యంతరం చెప్పింది. ప్రపంచంలోనే రెండో అత్యంత ఖరీదైన నివాస సముదాయంగా ఇది పేరు పొందింది.

వరల్డ్ ట్రేడ్ సెంటర్ (1972-1974)

ప్రపంచంలో ఎత్తయిన... అత్యంత విషాదకరమైన రోజును చవిచూసిన భవంతి ఇది. 1972లో దీన్ని నిర్మించారు. న్యూయార్క్ నగరానికి చిహ్నంగా మారింది. ప్రపంచ వాణిజ్య కేంద్రంగా పరిఢవిల్లింది. దీన్ని నిర్మించడానికి ఏడేళ్ళు పట్టింది. 415 మీటర్ల ఎత్తులో జంట టవర్లుగా దీన్ని నిర్మించారు. అంతస్తులు 110. 2001 సెప్టెంబర్ 11న ఉగ్రవాదుల దాడిలో ఇది నిట్టనిలువుగా కూలిపోయింది. పూర్తిగా కనుమరుగయ్యింది. ఇది 7 భవంతుల సముదాయం. 1973 ఏప్రిల్ 4వ తేదీన దీనిని ప్రారంభించారు. ఇందులో మారియట్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ (3 డబ్ల్యూటీసీ), 4 డబ్ల్యూటీసీ, 5 డబ్ల్యూటీసీ, 6 డబ్ల్యూటీసీ, 7 డబ్ల్యూటీసీ సముదాయాలు ఇందులో ఉండేవి.

1975–1985 మధ్య కాలంలో వీటిని 400 మిలియన్ డాలర్ల ఖర్చుతో నిర్మించారు. 13 కోట్ల 40 లక్షల చదరపు అడుగులలో ఇందులో కార్యాలయాలు ఉన్నాయి. 1975 ఫిబ్రవరి 13న అగ్ని ప్రమాదం, ఫిబ్రవరి 26, 1993న బాంబు దాడి, జనవరి 14, 1998న దోపిడీ సంఘటనలను ఇది చవిచూసింది. ఈ నేపథ్యంలో దీన్ని ప్రైవేటుపరం చేయాలని పోర్టు అథారిటీ నిర్ణయించింది. 2001 జులైలో సిల్వర్‌స్టీన్ ప్రోపర్టీస్‌కు లీజుకిచ్చింది. ఇది జరిగిన రెండు నెలలకే అంటే సెప్టెంబర్ 11న అల్‌ఖైదా హైజాకర్లు రెండు విమానాలతో ఈ కాంప్లెక్సును ఢీకొట్టించారు. ఉదయం 8.46 నిముషాలకు ఉత్తరం వైపు ఉన్న టవర్ను, 9.03 నిముషాలకు దక్షిణం వైపు ఉన్న టవర్ను ఢీకొట్టారు. 56 నిముషాలపాటు మంటల్లో కనిపించిన దక్షిణ టవర్ ఉదయం 9.59కి కూలిపోయింది. అనంతరం ఉత్తర టవరు కూడా నేలకూలింది. 2.753 మంది ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. కాలిపోతున్న శిథిలాలు పడి సమీపంలోని భవనాలు కూడా దెబ్బతిన్నాయి.

వరల్డ్ ట్రేడ్ సెంటర్

విల్స్ టవర్స్ (1974-1998)

ప్రపంచంలో ఒక ప్రైవేటు యాజమాన్యంలో నిర్మించిన ఏకైక ఎత్తయిన భవంతి ఇది. ఎత్తు 442 మీటర్లు. అంతస్తులు 108. 1974లో దీన్ని చికాగోలో నిర్మించారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ పూర్తయిన రెండేళ్ళ అనంతరం దీని నిర్మాణం ప్రారంభమైంది. రెండు దశాబ్దాలకు పైగా ఇది ఎత్తయిన భవంతిగా నిలిచింది. చికాగోలో తొలుత దీనిని సియర్స్ టవర్స్ అని పిలిచేవారు. 2009లో దీనిని విల్స్ గ్రూప్ తీసుకున్న అనంతరం పేరు విల్స్ టవర్స్‌గా మారింది. ఇందులో అధిక భాగాన్ని అద్దెకిచ్చారు.

పెట్రోనాస్ టవర్స్ (1998-2004)

కౌలాలంపూర్‌లో అత్యంత ఎత్తైన కట్టడం పెట్రోనాస్ టవర్స్ (1998). అమెరికా వెలుపల మొదటిసారిగా నిర్మించిన పెద్ద భవంతి కూడా ఇదే. దీనినికూడా ట్విన్ టవర్స్‌గా రూపుదిద్దారు. దీని ప్రత్యేకత రెండు టవర్ల మధ్య కట్టిన ఆకాశ వంతెన (స్కై బ్రిడ్జి). అత్యవసర పరిస్థితులను ఎదుర్కొడానికి వీలుగా దీనిని కట్టారు. ఆకాశ హర్మ్యాల నిర్మాణానికి నిబంధనలు రూపొందించాల్సిన ఆవశ్యకతకు ఈ టవర్స్ దారి చూపాయి. విల్స్ టవర్స్ యజమాని పెట్రోనాస్ టవర్స్‌పై ఏర్పాటుచేసిన యాంటెన్నాకు అభ్యంతరం చెబుతూ న్యాయపోరాటం చేశారు. దీనివల్ల నిర్ణీత ఎత్తు పెరిగిపోయిందనీ, అది తమ వైభవాన్ని దెబ్బతీస్తోందనేది ఆయన వాదన. కానీ, న్యాయ నిర్ణయం పెట్రోనాస్‌కు అనుకూలంగా వచ్చింది. ఈ తీర్పుతో యాంటెన్నాలు నిర్మాణ రీతిలో భాగం కాదని ఆ తీర్పు సారాంశం.

తైపే 101 (2004-2007)

దీని ఎత్తు 452 మీ. అంతస్తులు 101. తైవాన్‌లో దీనిని నిర్మించారు. పెట్రోనాస్ టవర్స్ రికార్డును ఇది అధిగమించింది. తైపే 101కు ఈ రికార్డు 2004లో సొంతమైంది. 21వ శతాబ్దంలో తొలి ఎత్తయిన భవంతిగా దీనికి గుర్తింపు లభించింది. నిర్మాణపరంగా అత్యంత ఎత్తయిన, అతి ఎక్కువ అంతస్తులు, పెద్ద రూఫ్ రికార్డులను ఇది ఏకకాలంలో సొంతం చేసుకుంది.

బుర్జ్ ఖలీఫా (2007-...)

తైపే 101 నిర్మాణం ముగియడానికి ముందే ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద భవంతి నిర్మాణానికి అంకురం పడింది. సూపర్ టాల్ బిల్డింగ్..బుర్జ్ దుబాయ్...ప్రారంభమైంది. దాన్ని ప్రస్తుతం బుర్జ్ ఖలీఫా అని పిలుస్తున్నారు. దీనిని నిర్మాణ పనిలో 2400మంది కార్మికులు పాలుపంచుకున్నారు. రోజుకు మూడు షిఫ్టులుగా పనిచేశారు. ఒక్కొక్క అంతస్తు నిర్మాణానికి సగటున నాలుగు రోజులు మాత్రమే పట్టిందంటే ఎంత వేగంగా పని సాగిందో తెలుసుకోవచ్చు. డిసెంబర్ 2008 నాటికి ఇది 828మీటర్ల ఎత్తు చేరింది. అప్పటికే ఇది తైపే 101 ఎత్తును అధిగమించింది. ప్రపంచంలోనే అతి పెద్ద భవంతిగా రికార్డును సొంతం చేసుకుంది. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. దీనిలో అంతస్తులు 163. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో దీనిని నిర్మించారు.

ఇవీ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన ఎత్తైన భవనాల విశేషాలు. 1928లో మన్‌హటన్ బిల్డింగ్ రూపకల్పనతో ఎత్తయిన భవనాల నిర్మాణంలో పోటీ మొదలైంది. ఆదిలో అమెరికాకే పరిమితమైన ఆ పోటీ క్రమేపీ ప్రపంచవ్యాప్తమవుతోంది. భారత్ కూడా అదే దిశలో దూసుకెళుతోంది. పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యం ఇందుకు బాసటగా నిలుస్తోంది. నిర్మాణ పనిలో నూతన విధానాలను ఆవిష్కరిస్తూ.. సులభతరమూ చేస్తున్నాయి. విస్తృతమవుతున్న ఇంజనీరింగ్ నైపుణ్యానికి ఈ భవంతులు సజీవసాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ✦

భవిష్యత్ భారీ భవంతులు

- సౌదీ అరేబియాలోని జెడ్డాలో కింగ్ డమ్ టవర్ పేరిట ఓ భవంతిని నిర్మిస్తున్నారు. దీని ఎత్తు 1007 మీటర్లు. అంతస్తులు 167. 2018కి ఇది పూర్తికావచ్చని అంచనా.
- ఊహన్ గ్రీన్‌ల్యాండ్ సెంటర్. ఇది చైనాలోని ఊహన్‌లో మొలుస్తోంది. దీని ఎత్తు 636మీ. అంతస్తులు 125. 2017కు పూర్తికాగలదని అంచనా.
- చైనాలోనే షెంజెన్ నగరంలో పింగ్ యాన్ ఫైనాన్స్ సెంటర్‌ను 600 మీటర్ల ఎత్తుతో కడుతున్నారు. ఇందులో 115 అంతస్తులుంటాయి. ఇది 2016కు పూర్తవుతుంది.
- చైనాలోని టియాన్‌జిన్ నగరంలో గోల్డిన్ ఫైనాన్స్ 117 పేరుతో ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. దీని ఎత్తు 596.5 మీ. అంతస్తులు 114. ఇది 2018కి పూర్తవుతుంది. అలాగే షెన్‌యాంగ్ పట్టణంలో బావోనెంగ్ షెన్‌యాంగ్ గ్లోబల్ ఫైనాన్షియల్ సెంటర్‌ను 568 మీటర్ల ఎత్తుతో 128 అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఇది కూడా 2016కు పూర్తవుతుంది.
- ఇండియాలోని ముంబైలో వరల్డ్ వన్ సెంటర్ 442 మీటర్ల ఎత్తుతో సిద్ధమవుతోంది. ఇందులో 117 అంతస్తులుంటాయి.

అది ఆరు వందల గడపల పల్లెటూరు. వూళ్ళో చీమ చిటుక్కుమన్నా అందరికి నిమిషంలో పాకిపోతుంది. ఉదయం టీ బంకుల దగ్గర వూళ్ళోని మగాళ్ళందరూ చేరుతారు. అప్పుడే అన్ని విషయాలు వస్తాయి. అక్కడే చర్చలు పంచాయితీలు, పరిష్కారాలు జరిగిపోతుంటాయి. ఒకటి, రెండు కుటుంబాలు తప్ప మిగతా అందరివీ అటుయిటుగా ఒక మోస్తరు కుటుంబాలే. ఇప్పుడు వాళ్ళందరికీ ఎంకట లచిమి గురించే హాట్ టాపిక్.

"అరేయ్. ఎంకట లచిమి లేచిపోయిందటరా. ఎవ్వడితో ఏందిరా."

"ఎవ్వడితో ఏంది. ఆ యేసోబుగాడు లేడు, ఆటో ఏస్తడే వాడితోనే."

"మన పక్క వూరోడితోనా."

"అవునురా. యిది రోజూ ఒంగోలుకు పాశాకు గ్రైడింగుకు పనికిపోతా వుంది కదా. పిల్ల ఎంత పనిజేసింది. ఎర్రగా, బుర్రగా మీగడలా మిసమిసలాడుతా వుంటాది. నెల్లాళ్ళ కిందటే గదా ఆ పిల్ల అన్నకు మాదిగ పాలెం పిల్ల కమలతో గొడవ పడింది. పెద్దమడుసులు సర్దిచెప్పబట్టే సరిపోయింది. ఇప్పుడు ఆ పిల్ల ఈ పిల్లగాడితో లేసిపోయిందంటే పల్లెలోళ్ళకి గర్వం పెరుగుతాది. యిది ఎట్టా దారి తీస్తదో ఏమో."

"ఎటుదారి దీస్తదో ఏమోగాని, ఎవ్వరం సెప్పగలం. అది మటుకు ఏంజేస్తది. దాని నాయన మల్లారెడ్డి బాగా బతికినోడు. రాజకీయాల్లోకి బోయి వున్నది బోగొట్టుకొని పిల్ల పెండ్లి జేయను సేతులో సిల్లిగవ్వ లేక సతమతమవుతా వున్నాడు. యిల్లు గడవనీగు పెళ్ళాం వూళ్ళో పనులకు పిల్ల గ్రైడింగుకు పోతుండె. మల్లారెడ్డేమో యాపని సేయలేక యింకా రాజకీయాల్లో పైకి రాకపోతానా అని తెల్ల సొక్కా పంచె కట్టి తిరుగుతుంటే. మగపిల్ల కాయలు జూస్తమా అంతంత మాత్రమే. వూళ్ళో రాజకీయాలు నడుపుతా తిరుగుతుంటా వుంటే. ఎన్ని అనుకొని ఏం లాభములే. ఈ రోజుల్లో ఆడపిల్లకు భయంలేకుండా పోయింది. టివిలలో సీరియళ్ళు, సినిమాలు జూసి నేర్చుకుంటుండే. ఎవ్వరిని ఏమి అనుకునేకు లేదు. దాని కరమ ఎలా వుంటే అట్టా జరుగుతాదిలే."

• • •

"ఎంకట లచిమి హైదరాబాదు పోయిందటరా." "ఏడకోసాటికి పోవలసిందే కదా. ఈడకు ఎట్టా వస్తది. మల్లారెడ్డి ఎంత బాగా బతికి సెడినా పరువుగతోనడు. పిల్లపోయిన కాడ నుండి వూరిలో మొగమెత్తలేక కిందా మీదా అవుతున్నాడు. ముగ్గురు సందున ఒక్కగానొక్క పిల్లాయె. ఎంత లేనోడికయినా పిల్ల యిట్టాజేస్తే మనసు బాధపడకుండా వుంటదా."

"అన్నదమ్ములు వూళ్ళో హీరో లెక్క తిరుగుతుంటే. అదిజేసిన పనికి తల దించుకొని ఈధుల్లో పోతావుంటే."

"ఆ యేసోబుగాడు ఈపిల్లకు బాగానే లైను వేసిండులే. ఆటోలలో తీసుకుబోను తీసుకురాను జేసోటోడు గదా. ఆటోలో మాంచి మాంచి పాటలు పెట్టాడట. రోజుకో రకం పాటల కాసెట్లు దెచ్చిపెట్టి ఆటో తోలుతా ఆడు కూడా ఆ పాటలతో కలిపి బాగా పాడేవాడట. అట్టా ఈ పాట ఆ పాట అంటూ ఇద్దరికి మాటలు కలిసాయట. అట్టా పరిసయం అయినాక ఎనక

◆ కథ

ఎంకట లచిమి

- పి.రాజ్యలక్ష్మి

సీటులో కూర్చోనే ఎంకటలచిమి ఆడి పక్క సీటులో కూర్చోను మొదలెట్టిందట. యిక అంతే యిట్టే ఇద్దరికి లంకె కుదిరింది."
ఎన్నయినా అనుకోండిరా. యిద్దరు లచ్చనంగా బతికితే అదే సాలు."
"కరెప్టే గాని. యేసోబుగాడు పెద్ద కాయకట్టం జేసే మడసి కాదు. యాపని మీదా కుదురుగా వుండడట. మరి దాన్ని తీసుకుపోయినోడు ఎట్టా సాకుతాడో, ఏమో!"

• • •

"ఎంకటలచిమి హైదరాబాదులో ఏడ వుందో జాడ తెలిసిందిరా. యిద్దరు ఆడపిల్లలట. పెద్దదానికి నాలుగేండ్లు సిన్నదానికి రెండేళ్ళట. మొన్నామధ్దన మన సర్పంచు హైదరాబాదు బోయినప్పుడు అది కనబడినాదట. గుర్తుపట్టి ఏం బాబయ్య ఎట్టా గున్నవే అని ఆప్యాయంగా పలకరించినాదట. ఎంతయినా మన కళ్ళ ఎదుట పెరిగిన పిల్ల కదా.. ఎట్టగున్నదో, ఎలా బతుకుతున్నదో అని అడిగాడట. 'బాగానే వున్నాం బాబయ్య. యేసోబు బేల్దారి పనులకు పోతావున్నాడు. నేను అపార్టుమెంటు కాంట్రాక్టరు యింటి కాడ పనులకు పోతుండా. యిద్దరు పిల్లలతో కాలం గడుస్తా వుందిలే బాబయ్యా. నేను కనబడినట్టు ఎవురికి సెప్పమాకు' అంటూ సేతిలో సేయి ఏయించుకున్నదట."

• • •

"ఎంకట లచిమి వూళ్ళోకి వచ్చి వారం రోజులు కాలేదు. మళ్ళా కనబడటం లేదట. దానికి దూరపు సుట్టం వరుస అయ్యే అక్క వుంది గదా. ఆడకు పోయి దాని అక్క ఏదన్నా పని సూపిస్తదని అడిగే దానికి బోయిందట. దాని అమ్మ దాని కోసం లబోదిబోమని ఏడుస్తా వుంది. రేతిరిబోయి పోలీస్టేషనులో రిపోర్టు యిచ్చినాదట. సిన్నపిల్లలు "అమ్మా అమ్మా" అని ఒకటే ఏడుపు. ముసలిదానికి ఈ వయస్సులో సానా కష్టమొచ్చినాది. సిన్న పిల్లలను ఎట్టా సాకుతుందో ఏమో."

"ఎట్టాంటి కుటుంబం ఎట్టా అయింది. సర్పంచి వచ్చి అది హైదరాబాదులో కనిపించిందని సెప్పగానే మల్లారెడ్డి, ముగ్గురు కొడుకులు దాన్ని సూడనీకి పోయిండ్రు. ఎంతయినా పిల్ల మీద పేమ వుంటది గదా."
"ఆళ్ళ కరమ కాకపోతే, పోయిన ఏళా యిసేషం మంచిది కాకపోయా. యేసోబుగాడు కాంటాక్టరు కూతురికి లైను ఏసిండట. ఈళ్ళు ఎంకట లచిమి యింటికి పోయేకాడికి అది కాంటాక్టరు కాడ వుందని తెలిసి ఆడకు పోయిండ్రట. పోయేటప్పటికి కాంటాక్టరు కాడ యేసోబు సేతులు కట్టుకొని పక్కన నిలబడిపోయినాడట. యిదేమో కాంటక్టరు కాళ్ళట్టుకొని ఏడుస్తా బెంగపడతా వుందట."

"ఈళ్ళ నలుగురిని సూడగానే దానికి పానం లేసివచ్చిందట పాపం. లగెత్తుకుంటా వచ్చి నలుగురిని వాటేసుకొని బోరుమని ఏడిసిందట. యిసమా అర్థంగాక ఆడ అందరూ తెల్లమొగాలు ఏసారు. కాంటాక్టరు ఈళ్ళ దగ్గరకు వచ్చి ఎవురు మీరు అని అడిగి తెలుసుకొని.. 'వీడు బద్మాష్‌గాడు. వెధవ పనులు చేస్తున్నా ఈ పిల్ల మొహం చూసి వాడిని క్షమిస్తున్నా. మంచి పిల్లవాడని నమ్మి వచ్చింది కదా అని ఎంత బాగా చూసుకున్నా ఈ నాకొడుకు పాడు బుద్ధి మారలేదు. యిప్పుడు వీడు నా కూతురి జీవితమే నాశనం చేయటానికి సిద్ధపడ్డాడు. నా కూతురు పదిహేనేళ్ళ చిన్నది. దానికి ఏం తెలుసు? పెళ్ళి చేసుకొని యిద్దరు పిల్లలను కన్నాడు. వీడికి బుద్ధి వుండద్దా."
"ఈ నలుగురికి ఏమి జరుగుతా వుందో అర్థంగాక తెల్లమొహాలు ఏసుకొని ఎంకట లచిమి మొగంలోకి మొగం పెట్టి జూస్తున్నారు. అయ్యా యిక యేసోబు ఏ తప్పు జేసినా నాదే పూచి. మా అయ్య, అన్నదమ్ములు వచ్చారుగందా. యిక మా వూరికి బోయి బతుకుతాము. ఆడిని వదిలేయండయ్యా అని కాళ్ళుబట్టుకుంది." చూడు యిక యిదే ఆఖరు. మీకు రావలసిన డబ్బులు తీసుకొని పోండి. తెల్లారెప్పటికి యిక్కడ కనిపిస్తే తలకాయలు లేచిపోతాయి.' అని కాంటాక్టరన్నడు. ఆ రేతిరికి కాంటాక్టరు పంపిన నలుగురు మడుసులు ముసుగులేసుకొని సౌండు రాగుండ యేసోబుగాడి పీక కోసిండ్రు. తెల్లారేసరికి ఇసయం తెలిసి పోలీసులు వచ్చిండ్రు. ఎంకట లచిమి లబోదిబోమని ఏడుస్తా వుంటే, మల్లారెడ్డిని, ముగ్గురు కొడుకులను పోలీసులు జీబులో తోలుకొని పోయి స్టేషన్‌లో ఏసిండ్రు."

"స్టేషన్‌లో కాంటాక్టరు వున్నాడు. ఎస్.ఐ.తో మాట్లాడుతూ.. 'అవును సార్. ఆ పిల్ల నాన్న అన్నదమ్ములు వచ్చి రాత్రి గొడవ పడుతా వుంటే నేనే పంచాయితీ చేసాను. ఆరేళ్ళ కిందట వీళ్ళ కూతురు ఆ యేసోబుతో లేచిపోయి వచ్చింది. ఈ రోజు దాకా దాని జాడ తెలియలా. ఈ మధ్యనే వాళ్ళ జాడ తెలిసి వచ్చారు. వాళ్ళు వీడి మీద కసి తీర్చుకోవాలని వచ్చారు. గొడవలు పడుతుంటే సర్దిజెప్పి వచ్చాను. గోల సర్దుమణిగిందిలే అనుకున్నా. యిద్దరు పిల్లలు పుట్టిన తరువాత చేసేది ఏముందిలే అని ఒప్పుకొని వాళ్ళను తెల్లారి వూరికి తీసుకొని పోతామని నాతో చెప్పారు. వాళ్ళకు రావలసిన డబ్బులు కూడా యిచ్చాను. కాని వీళ్ళ మనసులో యింత కసి పెట్టుకొని అర్థరాత్రి అఘాయిత్యం చేస్తారని అనుకోలేదు." అని ఇరికించేసరికి. యిట్టా వీళ్ళేమో జెయిలుపాలు అయ్యారు. యిదేమో మొగుడిని పోగొట్టుకొని యింటికి జేరె. వూళ్ళో తల ఎత్తుకోలేకపోయా. మగోళ్ళు లేకబోయా. యింట్లో గడవాలి. ఏడకుబోయిందో ఏమో ఆ దేముడికే ఎరుక. మొహమెత్తుకోలేక ఏ నుయ్యోగొయ్యో సూసుకుందో ఏమో."

• • •

"అరేయ్ నిన్న అర్థరాతిరి ఎంకట లచిమి వచ్చిపోయిందట. నాలుగేళ్ళు అయినాది. యిన్నాళ్ళు అది కనబడకపోతే, దాని అమ్మ సచ్చిపోయిందనుకునే. యిన్నాళ్ళు ఏడవుందో ఏంజేసిందో ఎట్టా వచ్చిందో."
"దాని పిల్లకాయలను దీసుకుబోను వచ్చిందట. దాని అమ్మ' పిల్లలను యివ్వనుగాక యివ్వనని యింట నుండి గెంటిసినాదట. అన్నదమ్ములు దాని మొగం జూస్తే సంపేస్తామని అంటుండే. పాపం మల్లారెడ్డి జెయిలులో సానా రోజులు వుండి వచ్చి వూళ్ళో మొగమెత్తుకోలేక వురేసుకొని పోయా. ఏది ఏమైనా నా పిల్లలు నాకు కావాల. ఆళ్ళను వదిలిపెట్టి వుండలేను నా బతుకు నాశనం అయినాది. ఆళ్ళన్నా బాగా బతకాలని అనిందట."

"ఏందే బతికించేది. యిన్నాళ్ళు ఏడ సచ్చావే. సిన్న పిల్లలను వదిలిపోనీకు మనస్సు ఎట్టా వచ్చిందే. నీ పిల్లలు నిన్ను 'అమ్మా' అన్న గుర్తుగు కూడా లేదా! పనికిమాలిన దానా యిప్పుడు ఈ పిల్లలను నాశనం జేయనీకు వచ్చావా." అని దాని తల్లి గదమాయించినాది.
"అది కాదమ్మా. నేను చేసిన తప్పులు నాకు తెలిసి వచ్చాయి. యిక నేను యా తప్పులు జేయను. కట్టం జేసుకొని పిల్లలను బతికించుకుంటా. నా మాట నమ్ము." అని లచిమి అన్నాది.
"ఏందే నీ మాటలు నమ్మేది. సుట్టం దగ్గరికి పోయి వస్తానని సెప్పి యిన్నేండ్ల తరువాత వచ్చి పిల్లలను యివ్వమంటే ఎట్టా యిస్తాను. యిన్నేళ్ళు కాయకట్టం జేసి పిల్లలను సాకాను. ఇవ్వనుగాక ఇవ్వను."
"అమ్మా. నా మాటలు నమ్ము. అక్క ఒంగోలులో బాగా బతుకుతా వుంది కదా. నాకు కూడా ఏదయినా పని యిప్పిస్తదని పోయా. ఆళ్ళ యింటిలో వైభోగం జూసి బాగా బతుకుతున్నరు అనుకున్నా. పని చూపించమని అడిగా. నీకేమే. యింత అందగత్తవు. ఏ పనులు జేసినా పాడైపోతావు. నీడపట్టున పనులు జేసుకో. నేను బొంబాయి పోతున్నాను. నాకు తోడుగా రావా. నాలుగు రోజుల్లో వద్దాము. అసలే కష్టాలలో వున్నావు. కొంచెం బాధ తీరుతుందని తోలుకుపోయింది. నాలుగు రోజులు పోయినాక అక్క యాపారం తెలిసింది. ఆడ నుంచి ఎలా రావాలో నాకు తెలియదాయే. నన్ను బ్యూటీపార్లర్‌కు తీసుకొనిపోయి అందంగా తయారుజేసింది. వద్దే అక్కా. యింటికిబోతాను. యేసోబును జేసుకొని బతుకు నాశనం అయింది. పిల్లలు కళ్ళల్లో కనబడతావున్నారు. ఈ పనులు జేయలేను.. అని అన్నా.

సరేలేవే. నీయిష్టం. అయినా నాలుగు రోజులు కళ్ళు మూసుకో నీవాళ్ళు జైల్లో వున్నారు. ఆళ్ళను బయటకు తీసుకురాను పైసలు లేవు. పిల్లలను ఎట్టా సాకుతావు. ఒక సంవత్సరం ఈ పని చేసావనుకో బాగా సంపాదించుకొని నీ పిల్లలను బాగా చదివించుకొని బాగా బతకొచ్చు అని యిలా చెబుతుంటే నా బుఱ్ర కూడా పని చేయల. అక్క మాటలకు లొంగిపోతూ, వచ్చిన వాళ్ళందరికి లొంగిపోయా. వచ్చిన పార్టీలు పెద్దవి. డబ్బులు బాగా వస్తున్నాయి. అక్క ఆ డబ్బులు వూరికి పంపించి వాళ్ళను జైలు నుండి బయటకు తెప్పించింది. యిక అంతే. అప్పటి నుండి అక్కమీద గురి. ఏ పని అయినా అది చేస్తదని నా నమ్మకం. యిప్పుడు నాలుగు డబ్బులు సంపాదించుకున్నా. యిక నా పిల్లలను నాతో పంపియ్యి. ఆ పనులు మానుకొని పిల్లలను దగ్గర పెట్టుకొని ఏ బంకు అయినా పెట్టుకొని బతుకుతా."

"బేవార్సుముండ. పరువు తక్కువ పనులు జేసి బాగా బతుకుతావా. నువ్వు యింకా బతికినందుకు బాధగా వుంది. సచ్చిపోవే నీ పిల్లలకు తల్లి తిరుగుబోతు ముండ అని తెలిస్తే ఆళ్ళ బతుకులు బుగ్గిపాలు అవుతాయి. తల్లి సచ్చింది అంటే ఈళ్ళకు కూసింత గౌరవం అన్నా వుంటాది. నీలాంటి దాన్ని కన్నందుకు సిగ్గుతో సచ్చిపోతున్నా."

"ఎంతయినా ఆ ముసలిదానికి కాస్తంత పౌరుషం ఎక్కువే. వెధవ పనిజేసిన కూతిరిని సమించదు. పిల్లలను యివ్వనందుకు ఏడుస్తా పోయిందట ఎంకట లచిమి."

• • •

"ఎంకట లచిమిని పోలీసులు పట్టుకున్నారట. రాతిరంతా దాన్ని టీవీలలో సూపిస్తున్నారు. అది దాని అక్కను ఎదిరించి పోలీసులకు లొంగిపోయిందట. దానికి తల మీద దెబ్బలు వున్నాయి. పచ్చడిబండ తీసుకొని తలమీద బాదారట. ఈపు మీద తెగ కొరికారట. పుండ్లుపడి రకతము కారుతా వుంది. అది యిక నేను ఈ పని జేయను. ఆరోగ్యం బాగుంటంలా. ఈ పనులు జేయనీకు ఒళ్ళు హూనం అవుతావుంది. పిల్లల మీదకు గాలి మళ్ళింది. పిల్లలతో వుండాలని గోలజేస్తుందట."

"దీని మూలంగా దాని అక్కకు బాగా ఆదాయం వుందట. అందుకని దీన్ని బయటకు పోనీయటంలా. అదీగాక ఈ మద్దెన దీనితోపాటు దాని అక్కకు కూతురు వరస అయ్యేపిల్ల కూడా బొంబే, కలకత్తా తిరిగి ఈ మద్దనే ఈళ్ళ కాడకు వచ్చిందట. ముగ్గురు కలిసి యాపారం బాగానే నడుపుతున్నారు. నెల్లాళ్ళ కిందట కొత్తగా వచ్చిన పిల్లకు ఎయిడ్స్ వుందని తెలిసిందట. అందుకని దానికి యాపారం జరగటంలా. అక్కకా వయసయిపోయింది. దానికి సరిగా బేరాలు రావటంలా. ఏం మడుసులో ఏమో ఎంకట లచిమి అంటే అక్కడకు వచ్చే మొగోళ్ళు తెగ మోజు పడతారట. ఎప్పుడూ గిరాకినే. దీని మీద వచ్చే పైసలతో అక్కడ అందరికి రాజాలాగ జరుగుతా వుందట."

"ఈ మద్ద యాపారం జేయను. దాని వాటా డబ్బులు దానికి యిమ్మని గోల చేస్తా వుందట. యిది బయటగు పోతే వాళ్ళకు గడవదు. అందుకని దాన్ని బయటకు పోనీయగుండా ఆ యిద్దరూ ఇరవై నాలుగు గంటలు కాపలా కాస్తా వుండారు. ఏనాడన్నా ఎంకట లచిమి ఎదురు తిరిగితే ఆ యిద్దరూ ఆళ్ళకు సపోర్టు వచ్చే మొగాళ్ళు కలిసి దాన్ని బాదిపెడుతున్నారు. దానికేమో యాపారం మీద యిసుగుపుట్టి పదేపదే పిల్లలు యాదికి వస్తుండే. ఆడ నుండి బయటపడాలని అది పయత్నాలు జేస్తా వుంది. ఎన్ని గొడవలు వున్నా రాత్రి యాపారం అయిపోగానే తెల్లారకట్టా ఫుల్గా మందుకొట్టి పగలెల్లా మత్తులో వుంటరు. సాయంత్రానికి మేకప్పు వేసుకొని యాపారంలోకి దిగుతారు. ఓనాడు ఒంటిలో బాగాలేదని ఎంకట లచిమి మందు తాగల. ఆళ్ళసేత బాగా తాగించి ఆళ్ళు మత్తులోకి బోగానే యింటి గోడ దూకి



పోలీసుల కాడికిబోయి యిసయాలు జెప్పింది. తీగ లాగితే డొంకంతా కదిలింది. పోలీసులు ఆళ్ళ యిద్దరిని అరెస్టుజేసారు."

"ఎంకట లచిమి ఎటు వెళ్ళిపోయిందో. ఏందో లేరా. దాని బతుకు నాశనం అయింది. పోలీసు కేసు పెట్టి కోర్టు యిద్దరిని జైలుకు పంపించింది. దాన్ని ఏదో హోములో వేసారట. నాలుగు నెలలు అక్కడ దానికి ఏవేవో నేర్పించారట. దాని అక్క, దాని సుట్టానికి బెయిల్ తెచ్చుకొని యాపారం చేసుకుంటా దర్జాగా తిరుగుతున్నారట. బంగారం లాంటి పిల్ల ఎట్టా అయిందో. మన కళ్ళ ముందు పుట్టి పెరిగింది. సిన్నతనంలో తెలిసి తెలియకజేసిన తప్పులు బతికినంత కాలం ఎంటాడతాయి. దీని బతుకు బుగ్గిలో పోసిన పన్నీరు సామెత తీరు అయింది. అది హోములో నుండి వచ్చిన కాడ నుండి ఎవురికి కనబడలేదట. ఏడగుబోయిందో ఏమో."

✦

పెరుగు ఉప్మా

కావలసిన పదార్థాలు

పుల్లని పెరుగు: ఒక కప్పు
ఉడికించిన బియ్యం రవ్వ: ఒక కప్పు
పచ్చి మిర్చి: 3
జీడిపప్పు: ఇష్టాన్ని బట్టి
అల్లం: ఒక అంగుళం
ఉప్పు: రుచికి సరిపడా
కొత్తిమీర, కరివేపాకు: రుచికి సరిపడా
నూనె: రెండు టేబుల్ స్పూన్లు

తయారీ

ఒక పాన్‌లో నూనె పోసి వేడెక్కాక ఆవాలు, పచ్చి మిర్చి, కరివేపాకు, జీడిపప్పు, తరిగిన అల్లం వేసి వేగించాలి. అవి వేగిన తర్వాత పెరుగు, కొత్తిమీర వేసి బాగా కలిపి మరిగించాలి. ఆ తర్వాత ఉడికించిన బియ్యం రవ్వ వేసి ఉండలు లేకుండా బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని రెండు నిమిషాలు ఉడికించి, ఆ తర్వాత బౌల్ లోకి తీసుకోని కొత్తిమీరతో గార్నిష్ చేయాలి.

సగ్గు బియ్యం ఉప్మా

కావలసిన పదార్థాలు

సగ్గుబియ్యం: 3 కప్పులు
వేరుశెనగపప్పు: ఒక కప్పు
పచ్చిమిర్చి: 4
పచ్చి కొబ్బరి తురుము: 2 చెంచాలు
ఆవాలు, జీలకర్ర: ఒక చెంచా
నిమ్మరసం: అర చెంచా
నూనె: 2 చెంచాలు
కరివేపాకు: ఒక రెమ్మ
ఉప్పు, నీళ్ళు: తగినంత

తయారీ

సగ్గుబియ్యాన్ని శుభ్రంగా కడిగి ఒక గంట పాటు నానబెట్టాలి. స్టౌ వెలిగించి మూకుడు పెట్టి నూనె వేడి చేసి జీలకర్ర, ఆవాలు, పచ్చిమిర్చి, కరివేపాకు వేయాలి. తరువాత సగ్గుబియ్యం, వేరుశెనగ పొడి, ఉప్పు వేయాలి. కాసేపటి తర్వాత నీళ్లు పోయాలి. మిశ్రమం దగ్గరగా అయ్యాక కొబ్బరి తురుము, నిమ్మరసం కలిపి దించేసుకోవాలి.

టమాటా ఉప్మా

కావలసిన పదార్థాలు

ఉప్మా రవ్వ: పావు కిలో
నూనె: అరకప్పు
టమాట గుజ్జు: కప్పు
ఆవాలు: టీస్పూన్
సెనగపప్పు: టీ స్పూన్
జీడిపప్పు: పది
పల్లీలు: కొద్దిగా
నూనె: టేబుల్ స్పూన్
నెయ్యి: అర కప్పు
ఉల్లిముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు
అల్లం ముక్కలు : ఒక కప్పు
కరివేపాకు: కొద్దిగా
ఉప్పు: తగినంత
నిమ్మ రసం: ఒక టీ స్పూన్
కొత్తిమీర: కొద్దిగా

తయారీ

స్టౌ వెలిగించి కళాయి పెట్టి నూనె వేడి చెయ్యాలి. నూనె కాగిన తరువాత సెనగపప్పు, పల్లీలు, జీడిపప్పు వేయించాలి. తర్వాత ఎండు మిర్చి, కరివేపాకు వేసి వేగిన తర్వాత మిర్చి, అల్లం ముక్కలు వేసి వేగనివ్వాలి. టమాటా గుజ్జు కలిపి, రెండు గ్లాసుల నీళ్లు పోసి ఉప్పు కలిపి మూత పెట్టాలి. నీళ్ళు మరుగుతుండగా మూత తీసి రవ్వ పోస్తూ బాగా కలిపి గట్టి పడ్డాక స్టౌ ఆపాలి.

ఇప్పుడు నెయ్యి, నిమ్మరసం వేసి కలిపి కొత్తిమీర వేసి మూత పెట్టాలి.

ఉప్మా బొండం

కావలసిన పదార్థాలు

శనగపిండి: ఒక కప్పు
బియ్యం పిండి: 1/2 కప్పు
బంగాళ దుంపలు ముక్కలుగా తరిగిన బీన్స్
టమాటా ముక్కలు
ఆవాలు: ఒక స్పూన్
పచ్చిమిర్చి:3 (చిన్న ముక్కలుగా తరగాలి) వంట సోడా : చిటికెడు
నూనె: తగినంత
క్యారెట్: 1 (తురమాలి)
కరివేపాకు
తరిగిన ఉల్లిపాయలు
తరిగిన అల్లం
జీడిపప్పు
ఉప్పు: రుచికి సరిపడా
కారం: ఒక స్పూన్

తయారీ

ఒక పాన్‌ను పొయ్యి మీద పెట్టి నూనె పోసి ఆవాలు, పచ్చిమిర్చి ముక్కలు, తరిగిన అల్లం, కరివేపాకు, ఉల్లిపాయలు వేసి ఒక నిమిషం వేయించాలి. ఆ తర్వాత బంగాళ దుంప ముక్కలు, బీన్స్ ముక్కలు, టమోటా ముక్కలు రెండు నిమిషాలు వేయించాలి. ఆ తర్వాత మూడు గ్లాసుల నీటిని పోసి మరిగించాలి. నీరు బాగా మరిగిన తర్వాత రవ్వ పోసి ఉండలు కట్టకుండా కలపాలి. ఒక నిమిషం అయ్యాక స్టౌ ఆఫ్ చేయాలి. ఇది కొంచెం చల్లారిన తర్వాత చిన్న చిన్న బాల్స్‌గా చేసుకోవాలి. ఒక బౌల్‌లో శనగపిండి, బియ్యం పిండి, వంట సోడా, ఉప్పు, కారం వేసి బజ్జీల మాదిరిగా కలుపుకోవాలి. ఈ పిండిలో పైన తయారు చేసుకున్న బాల్స్‌ని ముంచి నూనెలో గోల్డ్ కలర్ వచ్చే వరకు డీప్ ఫ్రై చేయాలి.

చుక్కలు కలుపుదాం



స్పెషల్

ఈ చిత్రంలో ఐదు గుడ్లగూబలు ఉన్నాయి. అందులో ఒకటి మాత్రం భిన్నంగా ఉంది? అది ఏదో గుర్తించండి.

నీడను గుర్తించండి

మీకు చేపలంటే భలే ఇష్టం కదూ. అయితే మీకో చిన్న పరీక్ష. ఈ చిత్రంలోని చేప అసలు నీడ ఏదో గుర్తించండి.



ఏయే జంతువులున్నాయి

ఈ చిత్రంలో ఓ జీవి ఉంది. కాకపోతే అందులో రెండు జంతువుల శరీర భాగాలున్నాయి వాటిని గుర్తించి చెప్పండి.



పది తేడాలు ఏవి?

ఆదివారం అంటేనే జాలీడే. ఇంట్లో అందరూ వుండే రోజు అదే కాబట్టి సంతోషంగా బావుంటుంది. బుజ్జి, బంటి సండే తీయించుకున్న ఫొటో ఇది. అయితే బుజ్జిగాడు ఒట్టి చిలిపి. ఫొటోషాప్‌లో కొన్ని మార్పులు చేసి అసలు, నకిలీ బొమ్మలను మీ ముందు వుంచాడు. మొత్తంమీద ఇక్కడ పది తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించండి చూద్దాం.

దారి కనుక్కోండి

కోడి తన గుడ్లను చేరుకోవడానికి సరైన దారి చూపించండి.





మొత్తం ఎన్ని?

ఈ చిత్రంలో ఒకే రకమైన ఆటకు సంబంధించిన వస్తువులు దాగున్నాయి? అవి ఎన్నో గుర్తించండి.

ట్రీ బ్యాట్

క్రికెట్ అంటే ఇష్టం లేని చిన్నారులుంటారా! ఖాళీ దొరికితే చాలు. ఓ బ్యాటు, బంతి తీసుకొని మ్యాచ్ మొదలెట్టేస్తుంటారు. రాళ్లు, రప్పలు, కర్రపుల్లలే వికెట్లు, బౌండరీలు. అందుకే ఇవాళ మీకు ఒక ట్రీ బ్యాట్ గురించి చెప్పాలి. ట్రీ ఏంటి? బ్యాట్ ఏంటి? అన్న అనుమానం రావొచ్చు. అదే మరి అసలు విశేషం.



- ఇంగ్లండ్‌లోని క్రెడిటన్ అనే పట్టణంలో ఓ క్రికెట్ క్లబ్ వుంది. అక్కడ 1890లో ఒక పైన్ ట్రీ నాటారు. రెండేళ్ల కిందట విపరీతమైన ఈదురు గాలులు వీచినప్పుడు ఆ చెట్టు మొదలు పైభాగం విరిగిపోయింది. అప్పటి వరకు అందంగా పచ్చగా వున్న చెట్టు ఒక్కసారిగా మధ్యకు నరికేసినట్టు అయిపోవడంతో క్రికెట్ క్లబ్బు సభ్యులే కాదు. స్థానికులు కూడా చాలా బాధపడ్డారు. దాన్ని ఎలాగైనా అందమైన కళాఖండంగా తీర్చిదిద్దాలనుకున్నారు.
- కెర్రీ, జోన్స్ 18 నెలలపాటు కష్టపడి పైన్ వృక్షం మొదలును ఒక క్రికెట్ బ్యాట్ మాదిరిగా చెక్కారు. అందుకోసం భారీ గొడ్డళ్లను, కరెంటు రంపాలను వాడారు.
- క్రికెట్ బ్యాట్ హ్యాండిల్‌కు 360 అడుగుల పొడవాటి తాడును చుట్టారు. ఇక రంగులు, అలంకరణ ఎటూ వుంటుంది. ఈ బ్యాట్‌ను చూడ్డానికి జనం తండోపతండాలుగా వస్తున్నారట. వచ్చాక బృందాలుగా, ఒంటరిగా...ఫొటోలు దిగేసి... ఫేస్‌బుక్కుల్లో పెట్టేసుకుంటున్నారు.
- అంత అందమైన వృక్షం పోయి... అంతకన్నా అందమైన బ్యాట్‌గా కళ్ల ముందు నిల్చినందుకు ...ఆల్ హ్యాపీస్.

అనువాద ప్రపంచంలో విహరింపచేసే కథలు

ఈ పుస్తకంలో ఎనిమిది కథలున్నాయి. తెలుగు ఒకటి, తెలుగు నుంచి ఇంగ్లీషు మూడు, తెలుగు నుంచి హిందీ ఒకటి, తెలుగు నుంచి ఉర్దూ, తెలుగు లిపిలో ఒకటి, ఇంగ్లీషు నుంచి తెలుగు ఒకటి, ఉర్దూ నుంచి తెలుగు ఒకటి, ఒకే కథ నాలుగు భాషల్లో ఉంది. బా॥ రహమతుల్లా రాసిన తెలుగు మూల కథ అది. దాని పేరు "బా". ఇందులో అదే పేరుతో ఉర్దూలో ఆంగ్లంలో అనువదించినది. ఉర్దూ "బా" కథను తెలుగులో చదువుకునేందుకు వీలుగా తెలుగు లిపిలో రాయడం జరిగింది. బా రహమతుల్లా తెలుగులో కథకుడిగా, కవిగా పరిచితుడే. ఆయన కుమారుడైన మేరాజ్ ప్రధానంగా అనువాదకుడు. వీరిద్దరూ బా మేరాజ్ పేరుతో కొన్ని అనువాదాలు చేసారు. బా రహమతుల్లా కథలను ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి పలువురు ప్రముఖులు అనువదించారు. బా మేరాజ్ యాత్ర మందిర్ మజీద్ ఉర్దూలో బా adieu, baa / ammee jaan/ kareemun కథలు అనువాద దునియాలోకి పాఠకుల్ని తీసుకెళతాయి. 'బా' కథల గురించి: ఫారుఖీ జిలాని బానో–యమ్.టి.ఖాన్ సబ్‌రస్ పత్రికలు – సదాశివ, దీవి సుబ్బారావు, చింతపట్ల సుదర్శన్, బామేరాజ్ అభిప్రాయాలు ఉన్నాయి. "బా" కథ ఎడ్ల బండి తోలే ఓ ముస్లిం జీవన కథాంశం. తన కొడుకుని చదివించి ఉద్యోగస్తుణ్ణి చేయడం.. తాను ఎడ్ల బండి తోలుతూ కుటుంబాన్ని పోషించడం... తన పిల్లల్ని బాగా ప్రేమించడం... జట్కా బండ్ల నుంచి ఎద్దుబండి తోలడం–దూదేకటం నుంచి మిషన్లు కుట్టడం పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన సాయిబుల వృత్తులు. బండి తోలే పని నుండి చెక్క బండి లాగే పేద ముస్లిం జంగ్లీ. ఆయన పేరు షేక్ అబ్దుల్ గఫూరు. ఆయన మృతి – గతించిన జ్ఞాపకాల ఊటగా కథా కథనం సాగుతుంది. మందిర్, మజీద్ కథ సెక్యులర్ భారతానికి అద్దం పడుతుంది. మేరాజ్ యాత్ర కథ యాత్రా చరిత్రగా సాగుతుంది. మనిషి కేంద్రంగా ఉండాలనేది– మానవత్వం – మంచితనం– తోటి మనిషిని ప్రేమించడం... అంతా సమానం అనే భావనకు ప్రతీకలు ఈ కథలు. ఇదో మంచి ప్రయోగాత్మక ప్రయత్నం.

-ప్రసన్నకుమారి

పంచమ్! ద ఫైవ్,
రచన: బా॥ మేరాజ్,
పేజీలు: 116
వెల:200
ప్రతులకు: బా మేరాజ్, 104 సాయి చైతన్య అపార్ట్‌మెంట్స్, చైతన్యపురి-హైదరాబాద్.





చిట్ట చివరి రేడియో నాటకం,
రచన: డా॥ వి. చంద్రశేఖర రావు,
పేజీలు: 352, వెల: రు 250/-, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ- హైదరాబాద్.

చిట్ట చివరి రేడియో నాటకం

కె. శివారెడ్డికి అంకితంగా ఈ సంపుటిని ప్రచురించారు చంద్రశేఖర్ రావు. 'ఒక కథా సమయంలో...' అంటూ రచయిత తన భావాలను ఆవిష్కరించారు. "నా కథలు నాలో పలు నిశ్శబ్దాలు, సంచలనాలు నిలవనీయని ఉద్వేగాలు, అవన్నీ వందలాది పదాలుగా వ్యాఖ్యలుగా ఒకానొక కథా భాషగా న్యారేటివ్‌గా మారి నేను నడిచివచ్చిన కాలాన్ని దాని నడకల్ని, మనుషుల్ని మనుషుల కలల్ని గాథల్ని వాళ్ళ గాయాల్ని రికార్డు చేశాను" అంటారు. ఈ కథల సంపుటిలో 31 కథలున్నాయి. "చిట్ట చివరి రేడియో నాటకం " నైట్ డ్యూటీ, నీటి పిట్టల కథలు. లెనిన్ ప్లేస్, ద్రోహ వృక్షం, బహుమతి, హైకూ, పార్వతి కల, నిద్ర పోయే సమయాలు లాంటి కథలు పాఠకుల్ని ఆలోచనలకు పదును పెడతాయి. నిద్రకు ఉపక్రమించబోయే సమయాల్లో చదువుతుంటే డాక్యుమెంటరీ సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. ప్రపంచీకరణ ప్రభావాన్ని చాలా కథలు కథనాల్లో వివరంగా చెప్పారు. విధ్వంసాన్ని చూపారు. 'కొన్ని చినుకులు కురవాలి' కథ స్త్రీ జీవితాల్లో పలు కోణాలు ఆవిష్కరిస్తుంది. సునీత పిన్ని హరిప్రసాద్‌ను పరిచయం చేయడం...35 ఏళ్ల సునీతకు తన పాత జ్ఞాపకాలు గుర్తుకురావడం... పోలీసు కాల్పుల్లో ఏ కదలికా లేని శరీరంలో హాస్పటల్‌లో ఉన్న సుందరం... అతనికి సేవలు చేసే అతని తల్లి ... అతనికై వేచి చూసే సునీత – హరిప్రసాద్ భార్య ఆత్మహత్య చేసుకోవడం...తల్లి సునీత కొత్త జీవితానికి దారి ఏర్పడినట్లు భావించడంతో కథ ముగుస్తుంది. లెక్చరర్ హరి తాను ఎదుర్కొన్న సంఘటనల సమాహారం "హైకూ" కథ. "ఫాతిమా గది" కూడా అమ్మ జ్ఞాపకాల జాడను చెప్పే కథ. సలీం తల్లికి సేవలు చేయడం... కెమెరామెన్‌గా అతని ఉద్యోగం... అతని ప్రియురాలిలో ఏదో భయం... లాంటి సంఘటనలతో కథ ఆద్యంతం చదివింపజేస్తుంది. ఈ కథ ఇండియా టుడేలో ప్రచురణ (2002) అయ్యింది. "నా కథల్లోని పాత్రలన్నీ నేనే" అన్న రచయితను ప్రతి కథలో చూడాల్సిందే! చదవాల్సిందే!

- తంగిరాల చక్రవర్తి



బౌద్ధం ఇప్పటికీ అవసరమా?
బొర్రా గోవర్ధన్
పేజీలు : 291
వెల: రూ.150/-
ప్రతులకు : మంగళగిరి బుద్ధ విహార డోర్‌నెం: 11-450/సి1, ఎన్.సి.సి.రోడ్ మంగళగిరి.

ఆంధ్రప్రదేశ్- ప్రత్యేక హోదా ఆవశ్యకత
గడ్డం కోటేశ్వరరావు
పేజీలు : 39
వెల : రూ. 5/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 33-22-2, చంద్రం బిల్డింగ్స్ చుట్టుగుంట, విజయవాడ



భామవో.. బామ్మవో

అందంగా... ఆరోగ్యంగా... వుండాలని కోరుకోని వారుండరు! కాకపోతే అవేవీ మన చేతుల్లో వుండవు. అనాకారితనం, జన్యుపరమైన లోపాలు... పుట్టుకతోనే ప్రాప్తిస్తుంటాయి. మనం వాటిని అందుకోవడం మినహా మరేం చేయలేం. ఫిలిప్పైన్స్ పాప అన్నా రొచెల్లె ఒరెల్లియాన్స్ సొండారె కథ అలాంటిదే. తన వయసు 18. కానీ శరీరమంతా ముడతలతో... క్షీణించిపోయి... వెంట్రుకలన్నీ రాలిపోయి... 65 ఏళ్ల బామ్మలా వుంటుంది. శాస్త్రీయంగా తనకున్న జబ్బును ప్రొగేరియా అంటారు. ఆ దేశంలో ఇలాంటి జబ్బు వున్న అతి కొద్ది మందిలో అన్నా రొచెల్లె ఒకరు.

ఆమెకు ఐదేళ్ల వయసులో ఈ జబ్బు వున్నట్టు తల్లి గుర్తించింది. పేద కుటుంబం అయినప్పటికీ వున్నంతలో తనకు మంచి వైద్యం అందించేందుకు ఆమె ప్రయత్నించింది. తాగి ఇంటికి వచ్చే తండ్రి... రొచెల్లిని కొట్టడమే కాక... కుటుంబానికి పట్టిన దురదృష్టమని కూడా ఈసడించుకునే వాడు. ఇంట్లోనే కాదు. బయటా ఎన్నో అవమానాలను చవిచూసింది. ప్రస్తుతానికి తన తల్లికి లాగే ఆమె కూడా బండి మీద బట్టలు, బొమ్మలు, పళ్లు విక్రయిస్తుంటుంది.

ఈ మధ్యే నాసాకు చెందిన పరిశోధనా శాస్త్రవేత్త ఒకరు రొచెల్లెకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స చేయిస్తూ మందులు ఇప్పిస్తున్నారు. ఆ విధంగా ఆర్థిక భారం కొంత తగ్గినా...ఆమె ఎప్పుడు రాలిపోతుందో ఎవ్వరికీ తెలీదు. ప్రస్తుతానికి ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తూ బతుకుతోందా పద్దెనిమిదేళ్ల పడుచు. ●

కవలల కోలాహలం

ఓహియోలోని ట్విన్స్‌బర్గ్ పేరుకు తగ్గట్టుగా కవలలకు హాట్‌స్పాట్. ప్రతి ఏటా అక్కడ జరిగే ఉత్సవం కవలల కోలాహలంతో నిండిపోతుంది. స్థానికుల నుంచి విదేశీయుల వరకు సంబరంలో పాల్గొంటారు. కేవలం కవలల కోసమే 1975 నుంచి చేస్తున్న ఆ ఉత్సవం నాలుగు దశాబ్దాలు గడిచినా సందడి చేస్తూనే ఉంది. అప్పటి నుంచి ప్రతి ఏటా తప్పక హాజరయ్యే వారి సంఖ్య భారీగానే వుంటుంది. ఇక్కడికి రావడం... అందరినీ కలుసుకోవడం ... అంతా సొంతింటి భావన కలిగిస్తుంది. ఆ వాతావరణం మాతృ వాత్సల్యాన్ని అందిస్తుంది. ఇద్దరు, ముగ్గురు, నలుగురి కవలల జోడీలెన్నో అక్కడ కలుసుకుని పార్టీ చేసుకొంటాయి. అంతే కాదు, తమకు ఇష్టమైన రకరకాల కాస్ట్యూమ్స్‌ను వేసుకుని ప్రదర్శనగా వస్తారు. ప్రపంచంలోనే అతి పెద్ద కవలల ఉత్సవం ఇదే. లండన్, కెనడా వంటి ప్రాంతాల నుంచి కవలలు హాజరవుతారు. 30 లక్షల జననాల్లో ఒకటి మాత్రమే కవలలయ్యే అవకాశముంది. అలాంటి అరుదైన జననాలను ఈ విధంగా వేడుక చేసుకుంటారు ట్విన్స్‌బర్గ్‌లో •